ప్రజాశక్తి
సోపతి

స్ఫూర్తినిచ్చే పోరాటం



అనురాధారెడ్డితో ఇంటర్వ్యూ

మార్చి 8, 2015 ఆదివారం అనుబంధం

సాధికారతే విముక్తి

తొలి అడుగులు ■
■ శిలాలోలిత, శైలజ కవితలు
ఆమె పాటకు చోటు లేదా? ■
■ కె.కవిత కథ : ఆటో డ్రైవర్

వ్యాధిని జయించిన ప్రతిభ

రీమా బన్సాల్ పేరెన్నిక గన్న భారతీయ ఆధునిక మహిళా పెయింటర్స్‌లో ఒకరు. మూడేళ్ల వయసులోనే కుంచెపట్టుకుని బొమ్మలేస్తున్న ఆమె ప్రతిభను తల్లిదండ్రులు, టీచర్స్ గుర్తించి ప్రోత్సహించారు. నరాల బలహీనత వ్యాధితో బాధపడే ఆమెకు కుంచె కుదురుగా పట్టుకోవడమే కష్టం. అటువంటిది ఏకంగా మామూలు చిత్రకారుల కన్నా అద్భుతంగా చిత్రాలు సృష్టించటం ఆమె దీక్షకు ఒక తార్కాణం. అనేక చిత్రలేఖనా పోటీల్లో ఆమె చిత్రాలు అవార్డులు, రివార్డులు గెలుచుకున్నాయి. హర్యానాలో జన్మించిన రీమా ప్రొఫెషనల్ పెయింటర్‌గా ఎదుగుతూనే మనస్తత్వ శాస్త్రాన్ని అభ్యసించారు. ఆమె చిత్రలేఖనా ప్రతిభకు ఇక్కడ కనిపిస్తున్న 'మ్యూజింగ్స్' తదితర చిత్రాలు మచ్చుతునకలుగా చెప్పవచ్చు.

■ అంతరంగం

విముక్తిపథం

వెన్నెల్లో తాజ్‌మహల్‌ను చూడాలనుకున్నట్టే అర్ధరాత్రి వేళ చార్మినార్‌ను చూడటం అద్భుతం. ఈ అద్భుతాన్ని ఒక కూతురు తండ్రితో కలిసి వెళ్ళి తిలకించగలదా? ఓ ఇంజనీరింగ్ విద్యార్థిని సహధ్యాయితో కలిసి చార్మినార్ దగ్గరకెళ్ళి ఆ నాలుగు గుమ్మటాల మీద కురిసే వెన్నెల సోయగాన్ని చూడగలదా? పగలంతా జనసమూహాల, వాహనాల రద్దీతో సతమతమయ్యే చార్మినార్ రాత్రి పన్నెండు తర్వాత నింపాదిగా విశ్రమించే దృశ్యాన్ని నలుగురు అమ్మాయిలు వెళ్ళి చూడగలరా? ఆ మధ్యన కొందరు చిత్రకారులు అర్ధరాత్రి రెండు గంటల తర్వాత చార్మినార్ ప్రాంతానికి వెళ్ళి ఆ కట్టడపు సోయగాన్ని చూసి చెప్పలేని అనుభూతికి లోనయ్యారు. అలాంటి అనుభవం పొందాలని రచయిత్రులలో, అధ్యాపకురాళ్ళో అనుకుంటే సంభవమేనా? సాధ్యమేనా? అసలు ఇలాంటి ఆలోచనలు చేయగలిగే స్వేచ్ఛ మహిళల మానస ప్రపంచానికి ఉన్నదా?

ఈ విధమైన ఆలోచన రాగానే ఎన్నెన్ని భయసందేహాలు చుట్టుముడతాయో! అసలు ఇదేం ఆలోచన అని ప్రశ్నిస్తారు. చిత్రపోతారు. విచికిత్సకు లోనవుతారు. రాత్రి సంగతలా వుంచితే, పగటిపూట చార్మినార్ గానీ, మరే ప్రాంతాలకు గానీ ఒంటరిగా మనసులోకి ఏ భయసందేహాలు రాకుండా మహిళలు ప్రయాణించే పరిస్థితులు ఉన్నాయా అన్నది ప్రశ్న. ఈ విశ్వం నా మాతృభూమి అని కల్పనా చావ్లా ప్రకటించారు. విశ్వాంతరాళంలోకి మహిళలు ప్రయాణిస్తున్నారు. కానీ ఓ నాలుగు మైళ్ళ దూరం నిర్భీతిగా నడవలేని పరిస్థితులు మరోవైపున కనిపించే కఠోర వాస్తవం.

కనుకనే ఆడదానిగా పుట్టినందుకు కించపడాల్సిన పరిస్థితి రాని రోజే స్త్రీలకు నిజమైన విముక్తి. ఎక్కడికంటే అక్కడికి వెళ్ళగలనని తలపోసే పరిస్థితులే సిసలైన స్వేచ్ఛకు సంకేతం. స్త్రీగా పుట్టినందుకు అవమానాలకీ, హింసకీ లోను కాని స్థితి సమసిపోయినప్పుడే ఆడవాళ్ళకు నిజమైన శాంతి. ఒకవైపున వివిధరంగాల్లో స్త్రీ పురోగమిస్తున్నట్టే కనిపిస్తుంటుంది. మరోవైపున ఉన్నచోటు నుంచి అడుగు కదపలేని స్థితి. మహిళా దినోత్సవాలు ఎన్ని వచ్చివెళ్ళినా మనసుకు నచ్చినవిధంగా జీవించే స్వేచ్ఛలేక పోవడం చేదునిజం. గతంలో మహిళని ఇంట్లో బందీగా ఉంచారు. ఇవాళ మార్కెట్ వ్యూహాల ఎత్తుగడలో పావుగా చేశారు. అన్నిటా స్త్రీలు కనిపిస్తున్నట్టే వుంటుంది. వారి రక్తమాంసాలతో సాగే వ్యాపారమే తప్ప హృదయం ఎక్కడా కనిపించదు. స్త్రీల స్వభావాల గురించి రచయితలు, తాత్వికులు ఎన్నో తీర్మానాలు చేశారు. కానీ వారి హృదయ స్పందనల్ని గమనించలేకపోయారు. ఆడవాళ్ళుగా పుట్టినందుకు వివక్షకు లోనయ్యే పరిస్థితిని తొలగించలేకపోయారు. ఆమెని ఆరాధ్యదేవతగా చేశారు. లేదంటే అధమురాలిగా చూశారు. కానీ మనిషిగా ఆమె అస్తిత్వాన్ని గుర్తించి గౌరవించలేకపోయారు. 'ఆధునిక స్త్రీ చరిత్రని తిరగ రాస్తుంద'న్న గురజాడ మాట ఇంకా నిజం కావలసి వుంది. సకల రంగాల్లో మహిళల సాధికారత ద్వారానే ఇది సాధ్యం.

వెంటాడే వాక్యం	మహిళల చరిత్ర అంటే... శతాబ్దాల తరబడి పురుషులు స్త్రీలపై విశ్వవ్యాప్తంగా కొనసాగించిన అణచివేత... స్త్రీ చైతన్యం అంటే... ఆమెకు సమానహక్కుల్ని తిరిగి అందించడం. – టెన్నెస్ క్లాఫ్లిన్

ప్రజాశక్తి

సోపతి

మార్చి 8, 2015

లేఖలు 4

మహిళా మాణిక్యాలు 5

కవర్‌స్టోరీ

సాధికారతే విముక్తి 6

కథ

ఆటో డ్రైవర్ 10

సినిమాలో మహిళ

కథానాయిక స్థానం ప్రశ్నార్థకం 12

తొలి అడుగులు 14

స్ఫూర్తినిచ్చే పోరాటం 16

శ్రామిక మహిళా ఉద్యమ ధ్రువతారలు 18

సంగీతం

ఆమె పాటకు చోటు లేదా? 19

ఇంటర్వ్యూ

పరిరక్షణకే మొదటి ప్రాధాన్యం 20

ఆకాశవాణిలో మహిళల చైతన్యం 22

సీరియల్

ప్రేమ - విప్లవం 24

ఈ వారం కవిత్వం

ఉమ్మనీటి సరస్సులో... 26



మహిళా సాధికారతే లక్ష్యంగా ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్ని జరుపుకుంటున్నాం. ఈసందర్భంగా ఇవాల్టి 'సోపతి'ని మహిళా ప్రత్యేకసంచికగా అందిస్తున్నాం. మహిళలకు సంబంధించిన విభిన్న పార్శ్వాల వ్యక్తీకరణ ఈ సంచిక విలక్షణత!

లేఖలు



ప్రత్యామ్నాయాల అవసరం

'ఈ వనరులే ప్రత్యామ్నాయం' కవర్ స్టోరీ చాలా బాగుంది. ఉచితంగా అపారంగా లభించే సూర్యరశ్మిని ఉపయోగించుకుని అపరిమితమైన విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చెయ్యవచ్చు. కానీ ప్రభుత్వాలు ఎందుకో ఆ విషయంలో చాలా నిర్లక్ష్యంగా ఉన్నాయి. ఇప్పటికైనా మేల్కొని ప్రత్యామ్నాయ శక్తివనరులపై దృష్టి పెట్టకపోతే భవిష్యత్ అంతా చిమ్మ చీకటే.

– రఘుపతి, మహబూబ్‌నగర్

చివరికి ఆసక్తికరంగా

ఈ వారం కథ 'అమ్మ చెబితే' టెక్నిక్ బాగుంది. ప్రారంభంలో కొంత విసుగనిపించింది. కానీ చివరికి వచ్చేటప్పటికి ఆసక్తికరంగా ముగిసింది.

– రమాదేవి, కాగజ్‌నగర్, ఆదిలాబాద్

చూడాలనిపించేలా...

యాత్రా కథనం అద్భుతంగా ఉంది. నిజంగా పాపికొండలు ఎలా ఉంటాయో ఏమో కానీ రచయిత చెప్పిన తీరు మాత్రం ఆకర్షణీయంగా ఉంది. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఇప్పుడు అక్కడున్న చాలా గ్రామాలు, గుళ్ళు, గోపురాలు మునిగిపోక తప్పదని తెలిసి మనసు బాధపడింది. ప్రభుత్వాలు ప్రజలకు నష్టపరిహారంగా భూములు, డబ్బులు ఇవ్వగలవేమో కానీ వారి జ్ఞాపకాలను తిరిగి తీసుకు రాలేవు కదా? మంచి కథనం రాసిన వంశీకృష్ణగారికి థాంక్స్.

– ఎం.మల్లికార్జున్, పెద్దపల్లి, కరీంనగర్

ఆలోచింపజేసింది

కవర్‌స్టోరీ ఆలోచింపచేసింది. గాలి, ఎండ, భూగర్భ ఉష్ణోగ్రత, బయోమాస్ వంటి అనేక ప్రత్యామ్నాయ వనరుల ద్వారా ఎనర్జీ అవసరాలను తీర్చుకోవచ్చన్న సంగతిని చాలా సింపుల్‌గా, అదే సమయంలో విశ్లేషణాత్మకంగా చెప్పారు. రచయిత దుర్గాప్రసాద్‌గారికి ధన్యవాదాలు.

– శంకర్రావు, భద్రాచలం

రంగారావు చరిత్ర వక్రీకరణ

మన మాణిక్యాలు అంటూ కొమురం భీం, రంగారావు గురించిన వివరాలు ఇచ్చారు. ఇందులో రంగారావు గురించి ఇచ్చిన సమాచారం తప్పుల తడకగా ఉంది. అసలు రొహిల్లా సిపాయిలతో కలిసి ఆదిలాబాద్ జిల్లాలో బ్రిటీష్ వాళ్ళపై రంగారావు పోరాడాడు అనడానికి ఆధారాలేమిటో రచయిత చెప్పాలి. నాకు తెలిసినంతవరకు రంగారావు ఇప్పటి మహరాష్ట్రలోని ఓ గ్రామాధికారి. 1857లో ప్రారంభమైన మొదటి స్వాతంత్ర ఉద్యమంలో ఒక వార్తాహరునిగా ప్రవేశించాడు. నానా సాహెబ్‌ని కలిసి నిజాం రాజ్యంలో కొంత మంది నాయకులకు నానా సాహెబ్ రాసిన ఉత్తరాలు తీసుకుని బయలు దేరి అనుకోని పరిస్థితుల్లో తనే తిరుగుబాటుకు నాయకత్వం వహించాలని అనుకుంటాడు. తిరుగుబాటు ప్రయత్నాల్లో భాగంగా నిజాంరాజ్యంలో అనేకమందిని కలుస్తాడు. అలా కలిసిన వారిలో నిజామాబాద్ జిల్లా కౌలాస్ ను పాలించే రాజా దీప్ సింగ్ ఒకరు. సొంత సైన్యం ఏర్పాటుకు దీప్ సింగ్ సహాయం చేస్తానన్నా చివరికి చెయ్యలేదు. ఈ పరిస్థితుల్లో వేరే ఊరు బయలుదేరిన రంగారావుకు బ్రిటీష్ సైనికులు ఎదురవుతారు. అతడి దగ్గర నానాసాహెబ్ రాసిన ఉత్తరం దొరికిందని, అతడూ బ్రిటీష్‌వాళ్ళపై తిరుగుబాటుకు ప్రయత్నిస్తున్నాడని గ్రహించి అరెస్ట్ చేశారని చరిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. చరిత్ర మొత్తం మీద రంగారావు కానీ, ఆయన అనుచరులనుకున్నవారు కానీ ఎక్కడా ఒక్క తుపాకి గుండును పేల్చిన దాఖలా కనిపించదు. అటువంటిది ఆదిలాబాద్ ఏరియాలో ఆయన పోరాటం జరిపాడని చెప్పటం పచ్చి అవాస్తవం కాక మరేమవుతుంది.

–ఎస్సార్కె, హైదరాబాదు

ఆమే సమస్తం

మహిళల గురించి ప్రపంచంలో ఎందరెందరో ఎన్నో సూక్తులు పలికారు. కానీ ఆమె మనసును తాకినవారు అరుదు. ఆమెని మనిషిగా తలచి గౌరవించిన రచయితలు కొందరే. ఆ కోవకు చెందిన మహా రచయిత చలం. "స్త్రీకి కూడా శరీరం వుంది. దానికి వ్యాయామం యివ్వాలి. ఆమెకి మెదడు వుంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకి హృదయం ఉంది. దానికి అనుభవం యివ్వాలి" అని స్త్రీ అనే గ్రంథంలో చలం చెప్పారు. ఇప్పటికీ అనేకమంది రచయితలు చలం చెప్పిన ఈ మాటని ప్రస్తావిస్తుంటారు. కానీ ఆచరణలో స్త్రీలను మనుషులుగా పరిగణించే ఉన్నతికి సమాజం ఎదగలేదు. శాస్త్ర, సాంకేతిక రంగాలు ఎంతగా విస్తరించినప్పటికీ స్త్రీని భోగవస్తువుగా చూసే ధోరణిలో మార్పు లేదు. రాచరికంలో, భూస్వామ్య సమాజాల్లో ఆడవాళ్ళను భోగవస్తువులుగా పరిగణించారు. ఈ కాలపు అత్యాధునాతన సమాజాల్లోనూ ఆమెని అమ్మకపు సరుకుగా చూస్తున్నారు. శతాబ్దాల చరిత్రలో ఎన్నో అవాంతరాల్ని అధిగమిస్తూ ముందుకు వస్తున్నప్పటికీ స్త్రీ పట్ల దృక్పథంలో మార్పు రాకపోవడం విషాదం.

ఆకాశంలో సగభాగం అని ఆడవాళ్ళ గురించి చెప్పారుగానీ, నిజానికి సమస్తం ఆమే! "స్త్రీ వలననే జన్మము, స్త్రీతోనే సంబంధం, స్త్రీతోనే వివాహం, స్త్రీ వల్లనే జగత్తుతో స్నేహం, స్త్రీ వల్లనే వంశాభివృద్ధి, స్త్రీ వల్లనే మర్యాద నిలుస్తుంది, స్త్రీ వల్లనే రాజులు కూడా జన్మిస్తారు, స్త్రీ వల్లనే స్త్రీ జన్మిస్తుంది, స్త్రీ లేకపోతే ఏమీ లేదు" అన్న గురునానక్ చెప్పిన మాటల్లోని సారాంశం అర్థం చేసుకోవాలి. సకల రంగాలు స్త్రీల అస్తిత్వంతో వెలుగుతున్నాయి. కనుక మనుషులుగా గుర్తించి, గౌరవించడం, మానవీయంగా వ్యవహరించడం జనాభాలోని సగం మంది బాధ్యత.

మహిళా మాణిక్యాలు

తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఎందరో మహిళలు క్రియాశీలక పాత్ర పోషించారు. ఆనాటి ఉద్యమాల్లో చురుకయిన పాత్ర వహించారు. స్ఫూర్తిదాయకంగా నిలిచిన వారిలో మాణిక్యాల్లాంటి కొందరు మహిళల గురించి...

చాకలి ఐలమ్మ (1895-1985) : ఆంధ్ర మహాసభలు జరుగుతున్న సందర్భంలో ప్రజల్లో తలెత్తిన సాయుధ పోరాటంలో క్రియాశీలక కార్యకర్తగా పాల్గొన్న వీరనారి చాకలి ఐలమ్మ. విసునూరి దేశముఖ్ రాపాక రాంచంద్రా రెడ్డి, అతని ఏజెంటు వీరంనేని శేషగిరిరావులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన చకిలం యాదగిరిరావు ఐలమ్మ ఇంట్లోనే వుంటూ ఆమెకు స్ఫూర్తి నొసగాడు. సంఘంలో చేరిన రైతుల నుంచి ఏదో నెపంతో లంచాలు గుంజుతున్న దేశ్‌ముఖ్ 500 రూపాయలు ఇవ్వాలని ఐలమ్మకు కూడా తాఖీదు పంపించాడు. అప్పటికే ఆమె భర్త, ఇద్దరు కొడుకులు కేసులో ఇరుక్కుని జైలు శిక్షననుభవిస్తున్నారు.

నేతల అండతో ఐలమ్మ అధికార్లకు లొంగకుండా ధైర్యంగా నిలచింది. మల్లంపల్లి మచ్చెందారు వద్ద కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న ఆరెకరాల పొలం నుంచి ఆమె మనుషులను వెళ్లగొట్టి పంటను తీసుకుపోవడానికి జమిందార్లు పూనుకున్నారు. ఇది చూసిన జనగామ దళం కోరికపై భీం రెడ్డి నరసింహారెడ్డి మున్నగువారి నాయకత్వంలో ఇరవై మంది కమ్యూనిస్టు యువకులు గ్రామానికి తరలివచ్చారు. గ్రామస్తుల నుంచి కర్రలు సేకరించి గూండాలను తరిమికొట్టి ధాన్యాన్ని ఐలమ్మ ఇంటికి చేర్చారు. ప్రతీకారంగా ఎస్ఐ ఫకృద్దీన్ పంపిన పోలీసులు వారిని అరెస్ట్ చేసి చిత్ర హింసలు పెట్ట సాగారు. ఆ సందర్భంలో యాభై సంవత్సరాలు పై బడిన ఐలమ్మ పోరాట వీరులు, వాలంటీర్లకు తన ఇంట్లో ఆశ్రయమిచ్చి కాపాడింది. ఆమె ధైర్య సాహసాలను మెచ్చుకుంటూ ప్రజలు పాటలు కట్టి పాడుకున్నారు. మహిళా వీరులకు ప్రతీకగా నిలిచిన ఐలమ్మ 1985లో కన్నుమూసింది.

దాయం ప్రియంవద (1921-2013): నల్లగొండ జిల్లా తుంగతుర్తి వాసులు దాయం రామకృష్ణారెడ్డి, లక్ష్మమ్మ దంపతులకు జన్మించిన ప్రియంవద అన్న రాజిరెడ్డితో పాటు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నది. నాల్గవ తరగతి వరకే చదివినా మార్క్సిస్టు సాహిత్య పఠనంతో అభ్యుదయ దృష్టి అలవడింది. ఆమె వదిన శశిరేఖ భీం రెడ్డి నరసింహారెడ్డి సోదరి. అన్న, వదినలతో కలిసి భోనగిరి ఆంధ్రమహాసభలకు వెళ్లినపుడు ఉద్యమ ప్రభావానికి లోనైంది. అన్న పార్టీ ఆర్గనైజర్‌గా తిరుగుతుండటంతో కొలనుపాక జైన పాఠశాలలో ఒక ఏడు టీచర్‌గా పనిచేసింది. ప్రభుత్వ నిర్బంధాల కారణంగా విజయవాడ వెళ్లినపుడు అక్కడ రైతు మహాసభలకు హాజరైంది. తిరిగి వచ్చాక స్త్రీలలో పోరాట చైతన్య వ్యాప్తికి కృషి చేసి అందరి అక్కగా పేరు తెచ్చుకుంది. ఊళ్లు తిరిగి మీటింగులు పెట్టి రజాకార్లను ఎదుర్కొనే విధానాలు బోధించేది. కొంతకాలం హుజూర్‌నగర్‌లో ఉండి తల్లిదండ్రులను కలువటానికి వచ్చినపుడు రాజిరెడ్డి ఆచూకీ కోసం తండ్రిని హింసిస్తున్న పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి మూడు నెలలు చంచల్‌గూడ జైలులో ఉంచారు. బయటకు వచ్చాక తుపాకీ పట్టుకుని దళ సభ్యులకు వైద్యం మొదలగు సహాయాలు అందించింది. వ్యాసాలు, కరపత్రాలు పంచింది. తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌పై దళం దాడి చేసినపుడు సెంట్రీగా ఉండి మళ్లీ అరెస్టయి సికింద్రాబాద్ కంటోన్మెంటు, వరంగల్ జైలులో రెండు సంవత్సరాలు శిక్షను అనుభవించింది. పోరాటం తొలి దశలో ఒకరిని వివాహమాడుదామనుకున్న కోరిక నెరవేరకపోవటంతో అవివాహితగానే ఉండిపోయింది. పోరాటంలో దివిటీలా వెలిగిన ప్రియంవద 2013 ఆగస్టు 3న తుదిశ్వాస విడిచింది.

కట్కూరి సుశీల (1930-2007) : నల్లగొండ జిల్లా ఆలేరు మండలంలోని శర్బనాపురంకు చెందిన కొమిరెడ్డి రాంరెడ్డి, సుందరమ్మల జ్యేష్ఠ పుత్రిక అయిన సుశీలకు తండ్రి పోలీసు పటేల్‌గా ఉండటంతో చిన్నపుడే గ్రామ ప్రజల సమస్యలపై అవగాహన ఏర్పడింది. చిలుకూరు ఆంధ్ర మహాసభలకు తండ్రి వెంట వెళ్లిన ఆమె భోనగిరి సభలో వాలంటీర్‌గా పనిచేసింది. 5వ తరగతి వరకు భోనగిరిలో చదివి హైదరాబాద్ రెడ్డి హాస్టల్‌లో ఉండి 8వ తరగతి వరకూ చదవుకుంది. అక్కడే రావినారాయణ రెడ్డి, ఆరుట్ల రామ చంద్రారెడ్డి, కమలా దేవి మొదలగు వారితో పరిచయం కలిగింది. ఉద్యమ బాట పట్టి కాచిగూడాలోని ఆంధ్రమహాసభ ఆఫీస్‌లో రావి భారతితో పాటు పనిచేసింది. నల్లగొండలో కట్కూరి రామచంద్రారెడ్డితో నేతల సమక్షంలో స్టేజి వివాహం జరిగింది. పార్టీలో ఫుల్ టైం వర్కర్‌గా ఉన్న రామచంద్రారెడ్డి సుత్తి కొడవలి గుర్తు ఉన్న తాళి బొట్టుతో పెండ్లి చేసుకున్నాడు. ఉద్యమంలో పాల్గొన్నందుకు గుల్బర్గా జైలుకు వెళ్లినా మగబిడ్డను ప్రసవించడంతో బయటకు వచ్చింది. కొడుకుపేరు విప్లవ అని పెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత కొల్లూరు గ్రామ సర్పంచ్‌గా (1979) పదకొండు సంవత్సరాలు పనిచేసింది. పోరంబోకు భూములను ఎందరో నిరుపేదలకు దానం చేసి ప్రజా సేవకురాలిగా జీవితం గడిపిన సుశీల 2007లో కన్నుమూసింది.

రాపోలు నర్సమ్మ (మరణం-2010) : నిజాం పరిపాలన కాలంలోని సాయుధ పోరాటంలో ఆరుట్ల మొదలగు నాయకులకు తన ఇంట్లో ఆశ్రయమిచ్చి పోరాటంలో పాలుపంచుకొన్న యోధురాలు రాపోలు నర్సమ్మ. బీబీనగర్ సమీపంలోని బోడుప్పల్‌లో నివసిస్తూ దొరల అన్యాయాలను, అక్రమాలను ధైర్యంగా ఎదుర్కొన్నది. కట్టుబాట్లను నిరసిస్తూ స్త్రీలకు అండగా నిలబడింది. కొడుకు రాపోలు రాములు ప్రజాపోరాటంలో గడపటం చూసి ఆనందిస్తూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొనే వారికి ప్రోత్సాహం అందించింది. ప్రత్యేక రాష్ట్రం కల పూర్తి కాకుండానే 2010 జనవరి 11న తనువు చాలించింది. ఆమె అంతిమ యాత్రలో అశేష జనం పాల్గొన్నారు.

లంబాడీ యోధులు : నిజాం పరిపాలనా కాలంలో పోలీసుల అండతో జమిందార్లు, దేశ్‌ముఖ్‌ల ప్రజాకంటక చర్యలకు వ్యతిరేకంగా పోరుసల్పిన లంబాడీ తెగల్లో మహిళలు నిర్వహించిన పాత్ర విస్మరింపరానిది. రాసూ నాయక్ కుటుంబంలోని పెద్ద కోడలు పుల్లమ్మబాయి (జోడ్యా నాయక్ భార్య) 1946 ప్రాంతంలో కొనసాగిన సాయుధ పోరాటంలో స్త్రీలను సమీకరించి వారిలో శౌర్యాన్ని నూరిపోసింది. అత్త మంగళిబాయి కూడా ఆమెకుతోడుగా నిల్చింది. స్త్రీలపై అత్యాచారాలకు పూనుకొన్న పోలీసుల కళ్లలో కారం చల్లి రోకళ్లతో మోది తరిమికొట్టిన ఘనత వీరిది. వీరి ధాటికి తట్టుకోలేక పోలీసులే వెనుతిరిగి పారిపోయిన సంఘటనలున్నాయి.

- ఆచార్య ఎస్వీరామారావు, 9848012053

■ కవర్ స్టోరీ



సాధికారతే విముక్తి

-ప్రొ. చల్లపల్లి స్వరూపరాణి

"2015 తరువాత నిజమైన మార్పును సాధించాలంటే.. అభివృద్ధి ఎజెండా లింగ సమానత్వం, మహిళా సాధికారతకు తప్పనిసరిగా ప్రాధాన్యత ఇవ్వాలి. యాభయ్ శాతంగా ఉన్న మహిళల పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోకుండా ప్రపంచం వందకు వంద శాతం సామర్థ్యాన్ని సాకారం చేసుకోలేదు."

-ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి బాన్ కీ మూన్

ఇవ్వాళ అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. 'మహిళా సాధికారతే మానవజాతి సాధికారత' అనేది ఈ ఏడాది థీమ్‌గా నిర్ణయించారు. స్త్రీ మూర్తులు సాధికారత సాధిస్తే అది మొత్తం మానవాళి సాధికారతకు దారి తీస్తుందనే దీని అర్థం. అసలు మహిళా సాధికారత అంటే ఏమిటి? ఇందుకు రకరకాల వ్యాఖ్యానాలు, నిర్వచనాలు వినిపిస్తున్నాయి. ఎవరి నిర్వచనాలు ఎలా ఉన్నా మహిళలు ఏవిధంగా అర్థం చేసుకుంటున్నారు, ఎలా అర్థం చేసుకోవాలనేదే మన ముందున్న చర్చ.

స్త్రీలు అంతరిక్షయానం కూడా చేస్తున్నారని, వారు ప్రవేశించని రంగం అంటూ లేదని మహిళా సాధికారత గురించి గొప్పగా చెప్పేవారి అభిప్రాయం నిజమే ! మహిళలు ప్రవేశించని రంగం అంటూ లేదు. ఒకవైపు మహిళలు కష్టసాధ్యమైన అంతరిక్షయానం, మిలిటరీ పోలీసు శాఖల వంటి వాటిలో కూడా ప్రవేశించి తమ సత్తా చాటుతున్నారు. అయితే మరోవైపు అణగారిన వర్గాల స్త్రీలు 'అభివృద్ధి'కి ఆమడదూరంలో ఉన్నారు. అభివృద్ధి విషయంలో అగ్రకుల ధనిక వర్గాల స్త్రీలకు, అణగారిన పేద స్త్రీలకు మధ్య ఎంతో వ్యత్యాసముంది. వెనకబడిన గ్రామీణ ప్రాంతాలలోని పేద, దళిత గిరిజన స్త్రీలు కనీస సౌకర్యాలు లేక పేదరికంలో మగ్గుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం మరుగుదొడ్లు లేక అనేక మంది పేద బాలికలు చదువు మానేయడం జరుగుతోంది. అలాగే కొన్ని ప్రాంతాలలో ఆచారాలు, సంప్రదాయాల పేరున దళిత స్త్రీలను జోగిని, బసివి, మాతంగిగా మార్చే విధానం ఇరవై ఒకటో శతాబ్దంలో కూడా అమలు కావడం ఆ స్త్రీలు అభివృద్ధికి ఎంత దూరంలో వున్నారో తెలియచేస్తుంది.

అభివృద్ధికి ఆమడ దూరంలో..

ప్రభుత్వాలు గ్రామీణాభివృద్ధి పేరున ప్రారంభించిన స్వయం ఉపాధి పథకాల వలన గ్రామీణ పేద స్త్రీలు కొంత లబ్ది పొందుతున్నప్పటికీ ఈ కార్యక్రమాలలో పారదర్శకతా లేమి, మధ్య దళారులు, ఉద్యోగుల దోపిడీ కారణంగా ఆయా అభివృద్ధి పథకాల వలన పేద స్త్రీలకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. ఆ స్త్రీల నిరక్షరాస్యత వలన కూడా వారు ఆయా పథకాలను సద్వినియోగపరుచుకోలేకపోతున్నారు. ఇటీవల అభివృద్ధి, భారీ

ప్రాజెక్టులు, మైనింగ్ పేరున ప్రభుత్వాలు ప్రారంభించిన కార్యక్రమాలతో నిర్వాసితులౌతున్న గిరిజనులలో ఆయా తెగల స్త్రీలు మరింత అభద్రతకు గురవుతున్నారు. ఇక ధనిక వర్గాల స్త్రీలలో చాలా మందికి తమ ఆర్థిక వనరులపై అధికారం వుండదు. దేశంలోని స్థిర చరాస్తుల వివరాలు చూస్తే స్థిరాస్తులు స్త్రీల పేరున కేవలం ఒక్కశాతం మాత్రమే రిజిస్టర్ కాబడి వుండటం గమనార్హం. అయితే వీరు తమ కుటుంబాలలో వుండే ఆర్థిక వెసులుబాటు కారణంగా విద్య, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకొని పోటీ పడగలుగుతున్నారు. ఆర్థికంగా ముందంజవేసి స్థిరమైన ఆదాయం పొందే మధ్య తరగతి ఉద్యోగ వర్గాలలో ఆడపిల్లల పెంపకం, వారి అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వడం వంటివి కొంత ఆహ్వానించదగిన పరిణామమే! అయితే స్త్రీలు ఎంతో పురోభివృద్ధి సాధించారని అందరూ పైకి మాట్లాడుతున్నప్పటికీ సమాజంలో స్త్రీల పట్ల ఉన్న సంప్రదాయ దృక్పథంలో పెద్దగా మార్పు రాలేదు.

రూపం మార్చుకున్న పురుషాధిక్యత

గతంలో ఉన్న పురుషాధిక్య ధోరణి ఇప్పుడు రూపం మార్చుకుని మరోవిధంగా వ్యక్తమవుతోంది. ప్రేమ పేరున, పెళ్ళి పేరున స్త్రీలపై హింస నానాటికి పెరిగిపోతోంది. ప్రేమించకపోతే అమ్మాయిని నరికి చంపే దుర్మార్గమైన హింసా ప్రవృత్తి యువకులలో పెరిగింది. అలాగే వరకట్న వేధింపు, గృహ హింస కూడా మారుతున్న సామాజిక, ఆర్థిక పరిణామాలలో కొత్త రకంగా వ్యక్తమవుతున్నాయి తప్ప మొత్తంగా సమాజంలో పితృస్వామిక ఆధిపత్య ధోరణిలో మార్పు రావడం లేదు.

స్త్రీలకు సొంత వ్యక్తిత్వం, ఆత్మగౌరవం వుంటాయి అనే విషయం ఇంటా, బయటా విస్మరించబడుతోంది. కట్టే బట్టలు, తినే తిండి,స్నేహసంబంధాలపైన కొత్త కొత్త రూపాల్లో పురుషుని ఆంక్షలు వచ్చిపడుతున్నాయి.

నిచ్చెన మెట్ల కుల సమాజంలో దళిత, ఆదివాసీ, వెనుకబడిన వర్గాల

వ్యవస్థాగతమైన మార్పు రావాలి

మహిళా సాధికారత అనేది చాలా విస్తృతమైన అర్థంలో వాడే పదం. కాని ఈ రోజు పాలకులు మహిళా సాధికారతని కొన్ని సంక్షేమ పథకాలకి పరిమితం చేస్తున్నారు. దీంతో మహిళా సాధికారత సాధ్యం కాదు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, సంస్కృతికంగా... అన్ని రంగాల్లో అవకాశాలు దక్కినప్పుడు, అభివృద్ధి సాధించినప్పుడే సాధికారత సాధ్యమవుతుంది.

ఈ రోజు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సమస్య ల పరిష్కారానికి అప్పటికప్పుడు ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఇది సమస్యకు పరిష్కారం కాదు. ఆ సమస్య మూలాలకు చికిత్స చేసినప్పుడే సమస్య పరిష్కారమవుతుంది. లేకపోతే మహిళలపై హింస పెరుగుతుంది. పట్టుకున్నాం, అరెస్ట్ చేస్తున్నాం, శిక్షించాం అంటూ ప్రకటనలు గుప్పించడం కన్నా అసలు, సమస్య రావడానికి కారణం ఏమిటి? అని ఆలోచించాలి. ప్రభుత్వాలు కల్లుదుకాణాలు ప్రారంభిస్తున్నాయి. అవి కార్మికులు నివసించే ప్రదేశాల్లో కావటం మరింత విడ్డూరం. అంతేకాక చీప్ లిక్కర్‌ని ప్రవేశపెడతామని చెబుతున్నారు. ఈ చర్యలన్నీ దేని కోసం? ఇవన్నీ తాగి మత్తులో మహిళలను హింసించమని ప్రోత్సహించడానికా? మత్తు మహిళలపై హింసను పెంచుతుందని అనేక సర్వేలు చెబుతున్నాయి. మద్యంపై నిషేధం విధించకుండా విస్తృతంగా అందరికీ అందుబాటులోకి తెస్తామంటే దాని అర్థమేమిటి? అశ్లీల, అసభ్యకర సాహిత్యం, సినిమాలు, నెట్, ప్రసారమధ్యమాలపై నియంత్రణ ఎంతో అవసరం. వీటిపై నియంత్రణ లేకుండా హింసను తగ్గిస్తామంటే ఎలా సాధ్యమవుతుంది?

తెలంగాణాలో మహిళల స్థితి ఒక్కొక్క జిల్లాలో ఒక్కోలా ఉంది. జోగిని, మాతాంగి, దేవదాసి వ్యవస్థలు వెళ్ళూనుకొని ఉంది. అక్షరాస్యత తక్కువగా ఉంది. ఆడపిల్లల సంఖ్య తగ్గడం, బాల్యవివాహాలు నేటికీ జరుగుతూనే ఉన్నాయి. అక్షరాస్యత తక్కువగా ఉండటం వల్ల మూఢనమ్మకాలు, దొంగ బాబాలను నమ్మటం లాంటివి పెరుగుతాయి. ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడిపడిఉన్న సమస్యలు. కాబట్టి ఇలాంటి సాంఘిక దురాచారాలను రూపుమాపాలంటే అక్షరాస్యతను పెంచాలి. సమస్య మూలాలను తెలుసుకోవాలి. అందుకు వ్యవస్థాగతమైన చర్యలు చేపట్టాలి ప్రభుత్వం. చొరవ చూపాలి. వ్యవస్థాగతమైన మార్పు వచ్చినప్పుడే సాధికారత సాధ్యమవుతుంది.

- టి.జ్యోతి, ఐద్వా

తన కోరికలను కూడా తీర్చుకోలేని స్వేచ్ఛ

ఒకప్పుడు యాసిడ్ దాడులు ఏమీలేకుండా భద్రంగానే ఉండేవాళ్ళం. కాని నేడు ఆ భద్రత లేదు. పురుషుల్లో మార్పురానంత వరకు ఇది సాధ్యం కాదు. ఆర్థికంగా మహిళలు ఎంత సంపాదించినా పువ్వులు కొనాలన్నా, చీరలు కొనాలన్నా భర్త నడిగే కొనుక్కోవాలి. మరి మనకు కావాల్సిన వాటిని కొనుక్కోవటానికి కూడా స్వేచ్ఛ లేదు. మన వ్యక్తిగత ఖర్చులను కూడా సంతోషంగా మనకు ఇష్టం వచ్చినట్లుగా కొనుక్కొనే స్వేచ్ఛ ఎప్పుడైతే వస్తుందోఅప్పుడే స్త్రీకి స్వేచ్ఛ, సమానత్వం లాంటివి వస్తాయి. దానికి ప్రభుత్వాలు, సమాజం ఒక్క యగ్నంలా భావించి పనిచేసినప్పుడే మహిళల సమానత్వం సాధ్యమవుతుంది.

- అమృత లత

స్త్రీల పరిస్థితి, వారి హోదా మరింత దారుణంగా వుంటుంది. వీరిపట్ల సమాజంలో చిన్నచూపు, వివక్ష వ్యక్తమవుతోంది. దళిత స్త్రీలు, బాలికలపైన అత్యాచారాలు, లైంగిక వేధింపులు, కులపరమైన అవమానాలు వారి ఆత్మస్థైర్యాన్ని దిగజారుస్తున్నాయి. విద్యా, ఉద్యోగ రంగాలలో ముందుకు వస్తున్న దళిత స్త్రీలపై కూడా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కుల వివక్ష, పురుష పెత్తందారీతనం నిరాటంకంగా కొనసాగుతోంది. గిరిజన తండాలలోని స్త్రీలు అన్ని రంగాలలో ఇతర స్త్రీల కంటే వెనుకబడి వున్నారు.

పదవి మహిళది అధికారం పురుషునిది

మనదేశంలో స్త్రీలు రాజకీయ రంగంలో ఎప్పటి నుంచో వుండడమే కాదు ఇందిరా గాంధీ వంటి స్త్రీ దేశ ప్రధానమంత్రిగానూ, మరికొందరు స్త్రీలు రాష్ట్రాల ముఖ్య మంత్రులుగా, గవర్నర్లుగానూ పనిచేశారు. దేశంలో అత్యున్నత పదవియైన రాష్ట్రపతి హోదాను కూడా ఒక స్త్రీ పొందింది. ఈ సమాచారాన్ని బట్టి దేశంలోని స్త్రీలు రాజకీయంగా సాధికారతను పొందారని చెప్పడానికి వీలు లేదు. రాజకీయాలలో కీలకమైన పదవులను పొందిన స్త్రీలలో ఎక్కువ మంది రాజకీయ నేపథ్యం వున్న కుటుంబాల వారే! అలా కాకుండా సాధారణ కుటుంబాల నుండి స్వంత ప్రతిభ, వ్యక్తిత్వం, చాకచక్యంతో ముందుకు వచ్చిన స్త్రీలను రాజకీయాలలో అణగదొక్కడం, వారిని స్వయంగా నిర్ణయాలు చెయ్యకుండా అడ్డుతగలడం వంటి ఉదాహరణలు మన ప్రధాన రాజకీయ స్రవంతి చూస్తూనే వున్నాం. 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం స్త్రీలకు స్థానిక సంస్థల్లో లభించిన రిజర్వేషన్‌లు కూడా అనేక విధాలుగా పరాయీకరణకు గురవుతున్నాయి. ఆధిపత్య కులాల స్త్రీలకు కేటాయించిన సీట్లలో వారి తరపున తమ కుటుంబాలలోని తండ్రులు, భర్తలు ఆ స్త్రీల తరపున అధికారాన్ని అనుభవిస్తుంటే దళిత, గిరిజన స్త్రీలకు కేటాయించిన సీట్లలో విడ్డూరంగా గ్రామాలలోని ఆధిపత్య కుల దొరలు, పెత్తందార్లు ఆ పేద స్త్రీల తరపున రాజకీయ నిర్ణయాలు తీసుకోవడం, వారిని పరాయీకరణకు గురిచెయ్యడం జరుగుతుంది. నిరక్షరాస్యులైన ఆ పేద స్త్రీలు దొరలు ఎక్కడ వేలు ముద్ర వేయమంటే అక్కడ వేసి వెళ్లిపోవడం సర్వసాధారణం. గ్రామ సర్పంచ్‌లుగా వుండి తమ పదవీకాలంలో ఒక్కసారి కూడా కుర్చీలో కూర్చోని దళిత, ఆదివాసీ స్త్రీలు ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

లింగ వివక్షకు తోడు కుల వివక్ష

ఎన్నికల సమయంలో, మహిళా దినోత్సవం వంటి సందర్భాలలో రాజకీయ నాయకులు, అధికారులు మాట్లాడే సాధికారతలో అనేక

సమానత్వం కోసం సంఘటిత ఉద్యమాలు

అన్ని రకాల హక్కులను అనుభవిస్తూ ఆత్మగౌరవంతో జీవించడమే మహిళా సాధికారత. సాధికారత దిశలో సాగాలంటే అన్నీ విషయాల్లోనూ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అవకాశాలు స్త్రీలకుండాలి. అలాంటి అవకాశాలు స్త్రీలకు సమాజం ఇవ్వడం లేదు. స్త్రీలు పోరాడి సాధించుకున్న హక్కుల్ని సహితం అమలు చేయడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి. సమాన పనికి సమాన వేతనం చట్టాన్ని సాధించుకున్నా ఈనాటికి స్త్రీలకు ఇచ్చే వేతనాలు 40శాతం పురుషుల కంటే తక్కువగా ఇస్తున్న పరిస్థితి. విద్యలో 100కి 54 మంది మాత్రమే చదువుకోగలుగుతున్నారు. పోషకాహారం తగినంత తీసుకోలేకపోతున్నారు. ఒక మనిషి 2200 కేలరీల ఆహారం తీసుకోవాల్సి ఉండగా స్త్రీలు 1400 కేలరీల ఆహారాన్ని మాత్రమే తీసుకోగలుగుతున్నారు. దీనితో అనారోగ్యానికి గురవుతున్నారు. స్త్రీలకు తమ సంపాదన మీద తమకు అధికారం కూడా ఉండటం లేదు. అడుగడుగునా ఎదురవుతున్న పురుషాధిపత్యం స్త్రీని ఒక మనిషిగా మనుగడ సాగించే అవకాశాన్ని ఇవ్వడం లేదు. స్త్రీ తాను ఏమి చదువుకోవాలి? ఏ ఉద్యోగం చేయాలి? ఎలాంటి వారిని వివాహం చేసుకోవాలి? ఎలా తన జీవితాన్ని మలచుకోవాలనే విషయాల్ని కుటుంబం, మతం, సమాజం స్త్రీ విషయంలో శాసిస్తుంది. పితృస్వామ్య ఆధిపత్య సమాజం స్త్రీని కూడా పితృస్వామ్య ఆధిపత్యాన్ని చెలాయించేలా తయారు చేస్తుంది అనడానికి తారాబాయి షిండే వ్యాఖ్యానాలే ఉదాహరణ. స్త్రీలు ఇల్లు దాటి పోకూడదు. ఆలోచనలు కుటుంబ పరిధి దాటి పోకూడదని మాట్లాడితే తమ స్థానం అదేనని భావించే స్త్రీలు కూడా కోకొల్లలుగా ఉన్నారు. అందుకే భర్త కొడితే తప్పు కాదని 60శాతం స్త్రీలు ఒక సర్వేలో వెల్లడించగలిగారు. ఢిల్లీ నిర్భయ ఘటనలో దోషి ఏమాత్రం తాను చేసిన ఘోరమైన నేరానికి పశ్చాత్తాప పడకుండా సమర్థించుకుంటూ మాట్లాడుతూ అత్యాచారాలు, హత్యలు చేయడం తమ జన్మహక్కుగా భావిస్తూ ఇంటర్వ్యూ ఇచ్చాడు.

మహిళల సాధికారత – మానవజాతి సాధికారతగా ఐక్యరాజ్యసమితి ప్రకటించడం హర్షించదగ్గ విషయమే. కాని మహిళలను సాధికారత దిశగా నడిపించే హక్కులను ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయకుండా మహిళా సాధికారత సాధ్యం కాదు. వివక్షను ఎదిరించుతూ అన్ని రంగాల్లోకి ప్రవేశిస్తున్న మహిళలు సహితం పోరాడి సాధించుకున్న హక్కుల అమలు కోసం కూడా పోరాడాల్సిన అవసరం ఉంది. స్త్రీలకు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కోసం విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో సమభాగస్వామ్యం కోసం మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక పోరాటదినాన్ని స్ఫూర్తిగా తీసుకుంటూ ఉద్యమించాలి. స్త్రీ, పురుష సమానత్వం కోసం సంఘటిత ఉద్యమాన్ని నిర్మించాలి. సమాన అవకాశాలను అందించే సమాజం కోసం సహితం మహిళలు పోరాడాలి.

– ఝాన్సీ, ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు)

ప్రభుత్వాలు దృఢసంకల్పంతో పనిచేయాలి

స్త్రీలందరూ వివిధ రంగాలలో పనిచేస్తున్నారు. ప్రతిచోట వేతనాలు, సౌకర్యాలు, రిటైర్మెంట్ భద్రత ఒక్కలానే ఉండవు. ఉదాహరణకి ఒక్క హైదరాబాద్‌లోనే దాదాపు 20వేల మంది రోడ్లని శుభ్రపరిచే పనిని చేస్తున్నారు. ఇలానే హాస్పిటల్స్‌లో, షాపింగ్ మాల్స్‌లో, పెట్రోల్ బంక్స్‌లో ఇలా అనేక చోట్ల పనిచేస్తున్న స్త్రీలందరికీ ప్రభుత్వం పెన్షన్ ఇచ్చే ఏర్పాటు చేస్తే బాగుంటుంది. స్త్రీలు ఇప్పుడు అనేక చోట్ల రాత్రివేళలో పనిచేస్తున్నారు. స్త్రీలు తాము పనిచేసే చోట నుంచి తమతమ నివాసానికి భద్రంగా వెళ్ళటం చాలా ముఖ్యం. దానికి కావాల్సిన ఏర్పాట్లు చేసుకోనేట్టు సంస్థలు, ప్రభుత్వాలు కలిసి పనిచేయాలి. అలాగే తల్లులు తమ పసిబిడ్డలని వదిలి పనికి వెళ్ళడానికి వీలుగా స్త్రీలు పనిచేసే చోట వారి పిల్లలకి కావాల్సిన క్రచ్‌లని ఏర్పాటు చేయాలి. ప్రతి చోట స్త్రీల కోసం శుభ్రమైన టాయిలెట్లు ఉండాలి. మహిళా సాధికారతని సాధించటానికి కావాల్సిన సదుపాయాలని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వాలు దృఢసంకల్పంతో ఉండటం చాలా అవసరం. అప్పుడే మహిళా సాధికారతని వేగంగా సాధించవచ్చు.

– కుప్పిలి పద్మ

కోణాలున్నాయి. భారతదేశం వంటి కుల, వర్గ సమాజంలో స్త్రీలు కూడా అగ్రకులాల వారిగా, దళితులుగా, ఆదివాసీలుగా, వెనుకబడిన కులాల వారిగా, మైనారిటీ మతస్తులుగా, ధనికులుగా, మధ్యతరగతివారిగా, పేదలుగా వున్నారు. సమాజంలోని పురుషులలో ఉండే సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలే ఆయా వర్గాల స్త్రీలకు కూడా వర్తిస్తాయి. కుల, వర్గ పరమైన గుర్తింపుతో పాటు అదనంగా పితృస్వామిక అణచివేత విధానం అన్ని కులాలలోను సర్వసాధారణంగా వుండే లక్షణం. సమాజంలో వుండే లింగ వివక్షకు కుటుంబాలలోని లింగ వివక్షపై వారు స్వయం నిర్ణయాధికారాన్ని పొందలేకపోవడానికి దోహదపడుతోంది.

మహిళా సాధికారత ఎలా?

'సాధికారత ' అనే దానికి ఎవరి అర్థాలు వారికున్నప్పటికీ సగటు స్త్రీలు అన్ని రంగాలలో స్వయం నిర్ణయాధికారాన్ని కలిగి వుండడమే ' సాధికారత ' గా భావిస్తున్నట్లు అర్థమవుతుంది. స్త్రీలు ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాలలో సాధికారత సాధించాలంటే మన కుటుంబ వ్యవస్థ, సమాజం మరింత ప్రజాస్వామికం

కావాలి. ప్రభుత్వాలు స్త్రీలపట్ల సానుభూతితో కాకుండా సహానుభూతితో వ్యవహరించాలి. స్త్రీని వ్యక్తిగా గుర్తించినపుడే అది సాధ్యమవుతుంది. హింసలేని సమాజం, హక్కుల హననం లేని రాజకీయ, సామాజిక వ్యవస్థలు స్త్రీల సాధికారతకు దోహదం చేస్తాయి.

రచయిత్రి సెల్ : 9440362433

ముప్పేట దాడిని ప్రతిఘటించాలి

మహిళా సాధికారత గురించి ప్రభుత్వాలు కొంగజపం చేస్తున్నాయి. 2001లో ఐక్యరాజ్యసమితి మహిళా సాధికారత గురించి మొదటగా ప్రస్తావించింది. ఇప్పటికి దశాబ్ద కాలం గడిచినా నేడు దేశంలో తిరోగమన భావజాలం రాజ్యమేలుతోంది. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా సమానత్వం అనుభవించినపుడే సాధికారతగా భావిస్తాం. ఏదో అరకొరగా సీట్లు కేటాయించడం, ఉద్యోగాలు ఇవ్వడం సాధికారత కాదు. ఆదివాసుల నుండి నేటి ఆధునిక మహిళ వరకు ప్రతి ఒక్కరూ సమానత్వాన్ని సాధించినప్పుడే సాధికారత అనిపించుకుంటుంది. సమాజంలో చెలమణి అవుతుందన్న పితృస్వామ్య భావజాలానికి అధికార ప్రభుత్వ హిందుత్వ భావజాలం తోడయింది. సాధికారత పక్కకు వెళ్ళి ఆస్థానంలో అణచివేత వచ్చింది. సాధించుకున్న హక్కులు, చట్టాలు, సాధికారతను ప్రశ్నిస్తున్నాయి. 498ఎ లాంటి చట్టాలను సమీక్షలంటూ నీరుగార్చుతున్నారు. వాటికి కోర్టులు సైతం తోడ్పాటునందిస్తున్నాయి. స్వామిజీలు, రాజకీయ నాయకులు మహిళలు ఎంతమంది పిల్లల్ని కనాలో చెబుతూ వారిపై తమ అభిప్రాయాలను రుద్దుతున్నారు. ఇలాంటివన్నీ పాలకులు నిర్దేశిస్తున్నారు.

మహిళా ఉద్యమాలు అత్యాచారాలకు స్త్రీలు బాధ్యులు కాదని ఘోషిస్తున్నాయి. కాని నిర్భయ కేసులో దోషైన ముఖేశ్‌సింగ్ నేరానికి ఆడవాళ్ళే బాధ్యత వహించాలని అంటున్నాడు. ఇలాంటి హిందుత్వ భావజాలానికి ఇతను ప్రతినిధి. ఇవన్నీ స్వారీ చేస్తున్నందువల్లనే స్త్రీలపై హింస పెరుగుతుంది, వీటికి పితృస్వామిక భావజాలం అజ్యం పోస్తుంది. స్త్రీలపై హింసను అమోదిస్తున్నదే ఈ భావజాలం. ఈ భావాజాలన్ని నిర్మూలించాలి. అదే సాధికారత. రాజ్యాంగం ఇచ్చిన హామీని అడ్డుకుంటుంది పితృస్వామిక భావజాలం. పేదరిక నిర్మూలనపై యుద్ధం, స్వచ్ఛ భారత్ అంటున్నారు. కాని యుద్ధం ప్రకటించాల్సింది పితృస్వామిక వ్యవస్థపై. 1982లో ఐక్యరాజ్యసమితి ప్రజాస్వామిక కుటుంబం అని పిలుపు ఇచ్చింది. అప్పుడు భారత్ కూడా హామీపై సంతకం చేసింది. కాని దాన్ని అమలు చేయడంలో మాత్రం ఏమాత్రం శ్రద్ధ చూపించడం లేదు. ప్రజాస్వామిక కుటుంబాన్ని అమలు చేసినప్పుడే హింస అనేది ఉండదు. కుటుంబంలో స్త్రీలు, నిజమైన హింసలేని జీవితాన్ని, హక్కులని గుర్తించగలుగుతాం. అందుకే ఈ సంవత్సరం పిఓడబ్ల్యు "స్త్రీలపై హింస, అణచివేతను తీవ్రతరం చేస్తున్న హిందూ పరివారాల, మోడీ పాలనకు వ్యతిరేకంగా పోరాడుదాం" అని పిలుపునిచ్చింది.

– సంధ్య, పిఓడబ్ల్యు అధ్యక్షులు

■ కథ

"ఏడికి పోవాలే" ఆటో డ్రైవరు మాటలతో గిరుక్కున వెనక్కి తిరిగింది నందిని. ఉప్పల్ బస్టాండ్ ప్రక్కన కమాన్ వద్ద నిలబడి ఏదైనా ఆటో వస్తుందా అని చూస్తున్న నందిని ఆటో వస్తుందా అని చూస్తున్న నందిని వెనుకే ఆపిండు ఆటోను ఆటోడ్రైవరు. అప్పుడు రాత్రి గం..10:20 ని.. "పర్వతాపూర్ దాటినాంక కాలనీకి పోవాలే" అన్నది నందని " నూట ఇరవై అయితదమ్మ" అన్నడు ఆటో డ్రైవరు నోరెళ్ల బెట్టింది నందిని" అంతెదుకు" డైరెక్ట్ అయితనే అరవై, డెబ్భైకన్నా ఎక్కువ తీసుకోరు" బేరం ఆడసాగింది నందిని. "రాత్రి పది దాటిందమ్మా, ఇప్పుడెవళ్లు ఎకక్కరు కదమ్మా, నీ ఇష్టమమ్మా" అంటూ ఆటోలో కూసుండు ఆటోడ్రైవరు. మరో ఆటో వచ్చే జాడ లేక పోవడంతో తప్పదన్నట్లు బ్యాగు, సూటుకేసులు రెండు ఆటో సర్దుకొని కూర్చుంది నందిని.

ఆటో డ్రైవర్

ఉప్పల్ నుండి కదిలింది ఆటో. ఇంత రాత్రి ప్రయాణానికి బయటు దేరిన తనను తాను ఇప్పుటికే పది సార్లు తిట్టుకున్నది నందిని. ఫ్రెండ్స్ బలవంతం చేయడంతో బాంబే నుండి నిన్న బయలు దేరింది నందిని. తాను వస్తున్న విషయం ఇంట్లో కూడా చెప్పలేదు. అందరు కలిసి తమ కుటుంబ సభ్యులకు సడన్ సర్‌ప్రైజ్ ఇవ్వాలనుకొని ఫ్రెండ్స్‌తో కలిసి బయలు దేరారు. ట్రైన్ లేటవడంతో సాయంత్రం 6 గం.. సికింద్రాబాద్‌కు చేరుకోవాల్సిన వాళ్లు కాస్త రాత్రి 9 గం..లకు వచ్చారు. ఇద్దరు వనస్థలిపురంలో ఉంటారు. ఒక ఫ్రెండ్‌ది ముషీరాబాదు. తనది పర్వాతాపూర్, ఆ ఇద్దరి ఫ్రెండ్స్‌ను 290 బస్సెక్కించి. నందిని మరో ఫ్రెండ్ భార్గవి బస్‌స్టాప్‌కు చేరుకున్నారు. భార్గవికి 102 దొరికింది. నందిని చూడగా 208 నెంబరు బస్సు ఒక్కటే ఉంది" ఇప్పుడు పర్వతాపూర్ వైపు బస్సుందా" అడిగింది నందిని.

"ఉప్పల్‌కు ఇదే ఆఖరు బస్సమ్మ, పర్వతాపూర్‌కు సాయంత్రం తర్వాత బస్సులే లేవు. ఉప్పల్ లో కోఠీ నుంచి వచ్చే వుంటే సూద్దువు కాని, మొదలైతే ఇదెక్కు " అంటూ తొందర పెట్టాడు బస్సు డ్రైవరు.

నందిని బస్సెక్కి కూర్చొని భార్గవికి ఫోన్ చేసింది. తనకు ఉప్పల్ వరకు బస్సు దొరికిందని చెప్పింది. ఉప్పల్‌లో బస్సుకాని ఆటో కాని ఎక్కాక మళ్లీ ఫోన్ చేయమని చెప్పి ఫోన్‌లో డబ్బులు అయిపోయాయి. రీచార్జ్ చేయించాలనుకున్నది బస్సులు లేకపోవడం, ఆటోలు కూడా కనిపించకపోయిన కంగారులో రీచార్జ్ విషయం మర్చిపోయింది.

ఆటోలో కూర్చున్నాక గుర్తుకురావడంతో తనకు ఏం చేయాలో తోచడం లేదు. ఫ్రెండ్స్ ఎవరైనా ఫోన్ చేస్తే నే తెలుస్తుంది. తన విషయం. ఆటో నెమ్మదిగా వెలుతుంది. అసలే చలికాలం సల్లగాలి వణికిస్తోంది. బ్యాగులోంచి శాలువా తీసి కప్పుకుంది. నల్ల చెఱువును దాటి ముందుకు పోయినాక, రోడ్డు దిగింది ఆటో.

ఒక్కసారిగా నందినిలో భయం ప్రవేశించింది. అనవసరంగా ఈ ఆటో ఎక్కానా అని ఈ మధ్య కాలంలో ఎన్నో వార్తలు పేపర్లలలో చదువుతున్నాం. ఆడవాళ్ల మీద దౌర్జన్యం,లేకపోతే అత్యాచారాలు. అంతేకాక చంపి ఏచెట్ల మధ్య పడేసి పోవడం అన్నీ గుర్తుకొచ్చి భయంతో అంత చలిలో కూడా చెమటలు పట్టాయి నందినికి. తన తో వచ్చిన ఫ్రెండ్స్‌కు కూడా తెలియదు. తానెలాంటి పరిస్థితలలో ఉన్నదో, ఫోన్ చేసే ఛాన్స్ కూడా లేదు తనకు, ఆటో ఎక్కేముందు, కనీసం ఆటో నెంబరేమిటో కూడా చూడలేదు తాను, తనకసలు బుద్ధి,లుదు, బుర్ర కూడా లేదు అను కుంటుండగానే, సడన్‌గా ఆటో ఆగింది. భయంగా బటయకు తొంగి చూసింది నందిని. ఎవరో నడివయస్సావిడ ఆటో డ్రైవర్‌తో "మల్లికార్జున నగర్ కెళ్లాలి, ఇప్పుడు ఆటోలు లేవు, బస్సులు లేవు అయినా ఒక్కతే ఉందిగా ఎక్కించుకుంటే ఏమవుతుంది" అంటుంది డ్రైవర్‌తో.

ఆటో లక్ష్మీనర్సింహస్వామి కమాన్ దాటగానే ఆపింది ఆమె. చీకట్లో సరిగ్గా కన్పించడం లేదు కాని గొంతుమాత్రం ఖంగుమని వినిపిస్తుంది.

"డ్రైవర్‌ని మాట్లాడుకున్నమ్మా సరేలే ఎక్కు, కాని ఎనభై రూపాయలవుతాయి" అన్నాడు ఆటో డ్రైవర్.

"రాత్రయితే చాలు మీరెంతంటే అంతే, ఏం చేస్తాం కానీ పదా ఇంగా" అన్నడు ఆటోడ్రైవర్.

"ఉదయం పూట ఒక్కళ్ల మీద ఒక్కళ్లను కూర్చోబెడతరు. మళ్లేమన్న పైసలు తక్కువ తీసుకుంటారా అంటే అదీ లేదు. రాత్రయితే డబల్, త్రిబుల్ ఛార్జీ వసూల్ చేస్తరు. ఇందంత మా బాస్ వల్లే జరిగింది. దొంగ ముఖంగాడు పని ఉందని చెప్పి అట్లనే కూర్చొబెట్టిండు. ఊళ్ల ఎక్కడ జాగా దొరకనట్లు, ఫ్లాట్ కూడా దొరకనట్లు మా ఆయనేమో గీ మూలకొట్టంల ఇల్లు కొన్నడు. రావాలన్నా కష్టమే. పోవాలన్నా కష్టమే, ఏం చేస్తాం నా ఖర్మ. పిల్లలేమయిన తిన్నరో. పాపం చేస్తున్నరో" ఆగకుండా అన్ని విషయాలు ఎవరితోనే చెపుతున్నట్లు తనకు తానే మాట్లాడుకోసాగింది. ఆమె.

ఆటోడ్రైవర్ మాత్రం ఏం మాట్లాడలే. ఆటో గ్లోబల్ స్కూల్ దాటి పీర్జాదీ గూడ దగ్గరకు వస్తుంది. నందిని బయటకు చూస్తే దూరంగా ఒక షాపు తెరచిఉంది.

"ఏయే ఆటో ఆపు రీ చార్జ్ కార్డ్స్ ఉంటాయేయో చూస్తా" గట్టిగా అరచింది నందిని.

సడన్ బ్రేక్‌తో ఆటో ఆపండి ఆటోడ్రైవర్ " ఏందమ్మా గంతగట్టిగ అరచినవే, ఏమయిందో అని కంగారు పడ్డా, సర్లే నువ్వేందిగుతావ్ కాని, డబ్బులియ్యి నేం తెస్తా"అంటూ డబ్బులు తీసుకొని షాపుకెల్లిండు

ఆటోడ్రైవరు.

నందినికి ఆటో డ్రైవర్నే కాదు, ఇప్పుడు ప్రక్కన కూసున్న ఆమెను చూస్తే కూడా నమ్మబుద్ధి కావట్లే, ఏమో ఎవరికి తెలుసు ఆమె కూడా గ్యాంగ్ లీడరేమో, ఎన్నిసార్లు చదవలే పేపర్లల్ల ఆడవాళ్లు కూడా దోపిడీలు, దొంగతనాలు చేయడం గురించి. అపనమ్మకంగా ఆమె వైపు చూసింది. చేతిలో సెల్ తీసుకొని ఏవో నెంబర్లు డయల్ చేస్తూ విసుక్కుంటుంది. ఆమె.

"ఈ దిక్కుమాలిన రూటులో సిగ్నల్స్ కూడా సరిగ్గా ఉండవు ఎవరికి ఫోన్లు కలవవు? పిల్లలు, ఈయన తిన్నరో లేదో, ఏం చేస్తున్నారో ? బాధపడసాగింది ఆమె.

నందిని ఆమెను అబ్జర్వ్ చేస్తనే, తన తల్లి దండ్రులను తిట్టుకోసాగింది. బాపుకు ఎక్కడ ఇల్లు దొరకనట్టు ఈమూలకు ఇండిపెండెంట్ ఇల్లు, కావాలని కొన్నడు. కాని ఈ ఇబ్బందులను మాత్రం గమనించలేదు. తనక్కూడ కోపం వస్తుంది. కాని ఏం చేయలేదు.

ఆటోడ్రైవర్ రీ చార్జ్ కార్డు తెచ్చిండు. నెంబరును మసకవెలుతురులో చూసుకుంటూ చార్జీ చేసుకుంది నందిని. ఇంతలో ఆటో కదిలింది. గూడెం దగ్గరికి చేసుకుంటుందనగా మూల మలుపులో సడన్గా ఒకామె చంటి పిల్లలతో ఎదురొచ్చింది. డ్రైవర్ సడన్గా ఆటో ఆపి ఆమెను కసురుకున్నాడు " సావడానికొచ్చినావమ్మ ? కింద పడనీకే నా ఆటోను దొరికిందా? బ్రేకెయ్యపోతే ఏం అవదువు" గట్టి గా అరిచిండు.

"అయ్యో కాదన్న, సాన సేపయింది ఈడ బస్సుదిగి, చీకటి పడింది. ఇంటికి పోనీకే బస్సు, ఆటోనో వస్తుందని చూస్తున్న, ఆటో సప్పుడు ఇనంగానే, ఆగకుండ పోతవేమోనని రోడ్డు మీదకి ఉరుకుంట వచ్చిన, నీకు దండం పెడత చైతన్య కాలేజీ దాటి నాంక దిగిపోత ఎక్కించుకోవా అన్నా" బ్రతిమిలాడ సాగింది ఆమె.

"ఎంతిస్తవు?" అడిగిండు ఆటో డ్రైవరు

"సేతుల ఇరవై అయిదు రూపాయలున్నయన్న, మా అయ్యకు పాణం బాగలేకపోతే సూడనీక పోయ్యొస్తున్న సాన లేటయింది" ప్రాథేయపడసాగింది ఆ పల్లెటూరామె...

"సర్లే ఎక్కు" అంటూ ఆమె నెక్కించుకొని ఆటో మళ్లీ స్టార్ట్ చేసిండు ఆటో డ్రైవరు.

చైతన్య కాలేజీ దాటినాంక ఒక చిన్న ఇంటిముందు ఆటో ఆపించుకుని పిల్లను తీసుకొని, డబ్బులిచ్చి ఆటోదిగి పరుగులాంటి నడకతో ఇంటికెళ్లిపోయింది. ఆమె. పర్వతాపూర్ దగ్గరకు రాగానే సెల్లో సిగ్నల్స్ కనిపించాయి. అంతలో భార్గవి నెంబరు కనిపించింది నందినికి సెల్ ఆన్ చేసింది" అసలెక్కడున్నావే, నేనెంత కంగారు పడుతున్నానో తెలుసా, ఇప్పటికొక ఇరవై సార్లు చేసుంటాను. ఫోన్ అసలు లైన్లే లేవు" ఆరాటంగా ఆరుస్తున్నట్లు మాట్లాడుతూనే ఉంది అవతలినుంచి భార్గవి.

"ఆటో దొరికింది భార్గవి, ఇక్కడ సిగ్నల్స్ సరిగా లేక నీకు ఫోన్ చేయలేదు. ఇంటికి దగ్గరలోనే ఉన్న, ఇంటికెళ్లగానే మళ్లీ ఫోన్ చేస్తానే "అంటూ ఫోన్ పెట్టేసి, తన తల్లి దండ్రులకు డయల్ చేయసాగింది. ఫోన్ కలువగానే "అమ్మా నేను నందుని ఇంటికి వస్తున్న, ఆన్‌ది వే లో ఉన్న " గుక్క తిప్పుకోకుండా చెప్పింది భార్గవి. అవతలనుండి ఏమంటున్నారో వినిపించకుండానే ఫోన్ కట్ అయిపోయింది.

ఆటో కాస్త ముందుకెళ్లింది బాలాజీ నగర్ నుండి కుడి వైపు తిరగబోతుంటే "అటుకాదు ఎడమవైపు తిప్పు ఈ పక్క కాలనీయే" అంటూ ఇంటికి దారి చెప్పసాగింది. సందులు తిప్పుతూ నందిని చెప్పిన వేలోనే ఆటోను తీసుకెళ్లసాగాడు ఆటోడ్రైవరు. ఒక ఇల్లు చూపి "ఇక్కడాపు" అంది నందిని. ఆటో చప్పుడు వింటూనే బయటకు వచ్చారు నందిని అమ్మానాన్న , మరియు తమ్ముడు.

"ఈ అర్ధరాత్రినీరాకేమిటే, అసలు నీ ఫోన్ వింటూనే ఉన్న అంతలోనే కట్ అయిపోయింది. పావుగంట నుండి కంగారు పడుతూనే ఉన్నాం " ఆ యాసంతో చెపుతూనే ఉంది నందిని వాళ్ల అమ్మ.

"అది కాదమ్మా మీ అందరికి సడన్ సర్‌ప్రైజ్ ఇద్దామని ఇలా వచ్చిన, కాని చాలా లేటవడంతో కంగారు మొదలైంది బస్సులేమో లేవు, ఆటోలో రావాల్సి వచ్చింది" సంజాయిషీ చెప్పింది. నందిని తండ్రి కోపంగా ఉన్నాడన్న విషయం అర్ధమవుతూనే ఉంది. అందరికి "ఎంతివ్వాలి ఆటోకు" అడిగాడు నందిని తండ్రి "నూటా ఇరవై సారు" అన్నాడు ఆటో డ్రైవరు.

"ఇస్తా ఉండు" అంటూ ఆలోనికెళ్లిండు నందిని తండ్రి.

"నేనిట్లంటున్న అనుకోకమ్మా కాని నువ్వు చేసిందానికి మీ నాయనకే కాదు ఎవ్వలకైనా కోపమొస్తది. గీ సర్‌ప్రైజ్‌లు చేయడాలు గవి సినిమాలల్ల, సీరియళ్లల్ల బాగుంటాయి కానీ, నిజ జీవితంలో చాలా చిక్కులు తెచ్చిపెడతాయి. గింత రాత్రి ఇంటికెట్ల జేరు తాననుకన్నవు? ఆడపిల్లలు ధైర్యం గుండాలే కాని, ఆపేరుతో గిట్లాటి పనులు చేయొద్దు. నాకు ఒక బిడ్డ ఇద్దరు కొడుకులమ్మా నా బిడ్డ బీటెక్ ఫైనల్ ఇయర్ సదువుతుంది. గామె కోసమే ఈ కష్టమంతా, కొడుకులిద్దరు కవలలు, సిన్న పిల్లలేనమ్మా" అన్నాడు ఆటో డ్రైవరు.

అంతలో నూటయాభై తెచ్చి చేతిలో పెట్టిండు నందిని తండ్రి. "చిల్లర ముప్పై లేనట్టున్నాయి సారు. ఇంగయాభై చేసుకోండి" తిరిగివ్వ బోయాడు ఆటో డ్రైవరు.

"లేదన్న నివే ఉంచుకో, చాలా థ్యాంక్స్. నా బిడ్డను క్షేమంగా ఇంటికి చేర్చినందుకు "అంటూ సామాను తీసుకొని, నిందినితో కలిసి ఇంట్లోకి పోయింద్రు అందురు.

"ఈ ముందు గల్లీల నుండి వెళితే మా కాలనీ వస్తుంది, రోడ్డుపైన మా ఆయనుంటానని ఫోన్ చేసిండు, గిట్లనే పోదామన్న" అని చెపుతుంది ఆనడివయస్సామె. ఆమె చెప్పిన వైపే ఆటోను మలిపాడు ఆటోడ్రైవరు.

– కె. కవిత, 9866367524

■ సినిమాలో మహిళ

కథానాయిక స్థానం ప్రశ్నార్థకం

ప్రముఖ నిర్మాత డాక్టర్ డి. రామానాయిడు కీర్తిశేషులయినాక, సామాజిక వెబ్ సైట్లలో నేనొక కామెంట్ చదివాను.

"ఇప్పుడు మనకు స్వర్గంలో ఒక హీరో వున్నాడు. అది ఉదయ్ కిరణ్. ఒక విలన్ ఉన్నాడు. అది శ్రీహరి. హీరో తల్లిదండ్రులు ఉన్నారు. అక్కినేని నాగేశ్వరరావు, అంజలీదేవి. ముగ్గురు కమేడియన్‌లు ఉన్నారు. ఎం.ఎస్. నారాయణ, ధర్మవరపు సుబ్రహ్మణ్యం, ఎ.వి.ఎస్. ఒక సంగీత దర్శకుడు వున్నాడు. చక్రి. ఇద్దరు దర్శకులు వున్నారు. బాపు, బాలచందర్. వీరందర్నీ కలిపి సినిమా తీయడానికి రామా నాయుడు, వి.బి. రాజేంద్ర ప్రసాద్ ఉన్నారు. నిజంగా సినిమా కనుక తీయగలిగితే స్వర్గంతో పాటుగా ఓవర్సీస్ అన్నట్లుగా భూలోకంలో కూడా అది విజయం సాధించడం ఖాయం"

ఈ కామెంట్ రచయిత ఎవరో ఉద్దేశ పూర్వకంగా మర్చిపోయాడో, తెలుగు సినిమాకు హీరోయిన్‌తో పనేంటి అనుకున్నాడో తెలియదు కానీ.. ఒక కరకు వాస్తవాన్ని హృద్యంగా చెప్పాడు. నిజమే తెలుగు సినిమాకు హీరోయిన్‌తో పనేంటి?

గత పది సంవత్సరాలలో గుర్తుంచుకు దగిన స్త్రీ పాత్ర ఒక్కటంటే ఒక్కటి అయినా తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి వచ్చిందా? అని ప్రశ్నించుకుంటే లభించే జవాబు పెద్ద సున్న.

హీరో పాత్రను ఎలివేట్ చేయడానికి దర్శక రచయితలు అందరూ తమ శక్తి సామర్థ్యాలను వెచ్చిస్తున్నారు తప్పిస్తే, సినిమాకు ప్రాణం లాంటి హీరోయిన్‌కి మాత్రం ఎలాంటి ప్రాధాన్యమూ యివ్వరు. హీరో ప్రక్కన నాలుగు డాన్స్‌లు చేసి, లేదా ఒక వాంప్ తరహా పాత్రలో నృత్యం చేసి ప్రేక్షకులను అలరించి అదే పెద్ద నటన అనుకుంటారు తప్పిస్తే.. నిజమయిన జవం, జీవం వున్న పాత్రలేవీ నేడు వాళ్లకు రావడం లేదు. ఇటీవల మొదలయిన మరొక కొత్త ట్రెండ్ ఏమంటే హీరోలను పరమ గ్లామరస్‌గా చూపిస్తూ, హీరోయిన్లను వారివెంట ప్రేమించు, ప్రేమించు అని పడితిరిగేలా చేయడం. నిజానికి సౌందర్యం స్త్రీ సొత్తు. స్త్రీ వెనుక పురుషుడు సంచరించడం ప్రకృతి ధర్మం. దాన్ని తిరగేసి, పురుషులు అపర ఋష్యశృంగుడి లాగా నటిస్తూ వుంటే వారిని ముగ్గులోకి దింపడానికి స్త్రీ పాత్రలు అసహ్యం కలిగేలా ప్రవర్తించడం నేటి తెలుగు సినిమా ధర్మం.

హీరో ఎంత ఛీదరించుకుంటున్నా, ఎంత అవమానకరంగా మాట్లాడుతున్నా స్త్రీ పాత్రలు అతడి వెంటే పడడం కూడా హీరో హీరోయిజాన్ని ఎలివేట్ చెయ్యడంలో ఒక భాగమే అని ప్రముఖ దర్శకుడు ఒకరు ఇంటర్వ్యూలో సెలవిచ్చాడు.

మనవాళ్లకి, బాలల సినిమా, మహిళల సినిమా ఇలాంటి టార్గెట్ ఓరియంటెడ్ సినిమాలు తీయాలని వుంటుంది. కానీ వాటి నిర్వచనాలలోనే బోలెడంత అయోమయం ఎదురవుతూ వుంటుంది. బాలల సినిమా అంటే బాలల కోసం తీసిన సినిమాలా? లేక బాలలతో తీసిన సినిమాలా? అనే అయోమయం వారికి ఎప్పుడూ పోదు. మహిళల సినిమాలు అంటే వాళ్ల ఆలోచనలు ఎప్పుడూ అమ్మలేని పుట్టిళ్లు, అమ్మాయి కాపురాలు వీటిల్లో మాత్రమే ఉంటాయి. లేదంటే పురుషుడిని రీప్లేస్ చేసి ఆ స్థానంలో స్త్రీని వుంచి దాన్నే మహిళా సినిమా అని నమ్మిస్తూ వుంటారు.

స్త్రీ, పురుషుడు యిరువురూ సమాజంలో భాగం. ఎవరి పాత్రను వారు సమర్థవంతంగా పోషిస్తారు. కనుక సమాజాన్ని ప్రతిబింబించే సినిమాలు తెస్తే ప్రత్యేకంగా 'మహిళా సినిమా' అనే బోర్డు పెట్టుకోవలసిన అవసరం వుండదు అని మనవాళ్లకి ఎప్పటికి తెలుస్తుంది?

గురజాడ 'ఆధునిక స్త్రీ చరిత్రను తిరగరాస్తుంది" అన్నాడు. "what does we mean women. Woman is the largest minority group in the world" అని జమైకాన్ కవి ఒకరు ఒకింత బాధతో నిర్వచించారు.

నిర్వచనాల మాట ఎలా వున్నా 'స్త్రీ అంటే మన అద్భుతమయిన జీవావరణంలో ఒక భాగం అనే స్పృహ మనకు ఎప్పుడూ లేదు. స్త్రీని వ్యక్తిగత ఆస్తి అనుకునే సమాజం ఒక వైపు వ్యక్తిగతం కూడా రాజకీయమే అనుకునే రాడికల్ చైతన్యం మరోవైపు కలిసి 'స్త్రీ' అనే పదానికి ఆ రూపానికి ఆ వ్యక్తిత్వానికి ఎన్ని వక్ర భాష్యాలు చెప్పాలో అన్ని వక్ర భాష్యాలూ చెపుతున్నాయి.

ఇలాంటి సున్నితమయిన, సంక్షుభితమయిన సన్నివేశంలో ప్రధాన 'స్రవంతి సినిమా' కు స్త్రీ పట్ల ఉండాల్సిన చైతన్యం ఉండవలసిన రీతిలో లేకపోవడం మనం తప్పుపట్టవలసినంత పెద్ద తప్పు కాదని సర్దుకుపోక తప్పదు.

ప్రధాన స్రవంతి సినిమాకు సమాంతరంగా మరొక సినిమా రూపు దిద్దుకోవాల్సిన అవసరం గురించి మనం చాలాకాలంగా మాట్లాడుకుంటున్నాం. ఎంటర్‌టైన్‌మెంట్ బిజినెస్ అనే సినిమా ట్యాగును, జీవితాలని సంస్కరించే ఎడ్యుకేట్‌కు బిజినెస్ అనే ట్యాగ్‌లైన్ కోసం సినిమా ఇంకా చాలా దూరం ప్రయాణించాలి.

ఒక సంపూర్ణమైన స్త్రీ పాత్రను సృష్టించాలి అనుకున్నపుడు స్త్రీ, మానసిక, భౌతిక, ఆధ్యాత్మిక ప్రపంచాల గురించిన అవగాహన సృజనశీలురకు అత్యంత అవసరం.

పరిచితము, అపరిచితము అనే అంశాల మధ్యన సతమతమయ్యే సృజన ప్రపంచంలో, ఈ అవగాహన కోసం ప్రయత్నం చేయడం అంటే

అది అసిధార వ్రతమే.

స్త్రీ ఎప్పుడూ మనకు పూర్తి పరిచితము కాదు. పూర్తిగా అపరిచితమూ కాదు. నిజానికి స్త్రీయే కాదు ఏ మనిషీ ఎవరికీ పూర్తి అపరిచితంగా మిగలడు. పూర్తి పరిచితంగా నిలవడు. ఆ పరాన్ముఖ కోణాలని అర్థం చేసుకోవడం అంటే నిరంతర అధ్యయనం, నిరుపమానమయిన పరిశీలనా అవసరం.

"మన సినిమా రంగంలో వున్నదంతా నిరక్షరాస్యులే" అని ఎప్పుడో అమీర్‌ఖాన్ వ్యాఖ్యానించిన విషయం ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకోవాలి. కేవలం పుస్తకాలు చదివితే వచ్చే జ్ఞానం మాత్రమే జ్ఞానం కాదు. అజ్ఞానానికి పరిపూర్ణత చేకూరాలంటే సామాజిక అధ్యయనం తప్పనిసరి. సరిగ్గా మన సృజన కారులలో లోపించిందే అది.

తెలుగు జీవితం, తెలుగు సినిమా రెండూ అమెరికన్ జీవితంలోనూ, హాలీవుడ్ సినిమాల్లోనూ ప్రభావితం అవుతున్న విషాద దృశ్యం మనకళ్లముందు కనిపిస్తున్నది. మన సృజన శీలుర ప్రతిభ గుడ్డివేళ్ల స్థాయికి వెళితే కానీ ఈ పరిస్థితిలో మార్పురాదు.

"మన సినిమా రంగంలో వున్నదంతా నిరక్షరాస్యులే" అని ఎప్పుడో అమీర్‌ఖాన్ వ్యాఖ్యానించిన విషయం ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకోవాలి.

తెలుగు జీవితంలో మరీ ముఖ్యంగా స్త్రీ జీవితంలో దు:ఖం వుంది. సాహసం వుంది. సౌందర్యం వుంది. వేదన వుంది. బాధ వుంది. అనురాగం వుంది. అణకువ వుంది. కానీ The world before her on the screen మాత్రం అందుకు విరుద్ధంగా వుంది.

మొన్నటికి మొన్న తెలంగాణలో జరిగిన దారుణ దురంతం నిజాం కాలం నాటి అకృత్యాలను గుర్తుకు తెచ్చింది. కెమికల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికురాలిని బిడ్డకు పాలివ్వడానికి కూడా కాంట్రాక్టర్ పోనివ్వకపోతే ఆ బిడ్డ ఏడ్చి ఏడ్చి గొంతు ఎండి సొమ్మసిల్లి సోలిపోయి మరణించింది. ఈ సంఘటనను మన సృజనశీలురు ఎవరూ పట్టించుకోరు.

Off the screen స్త్రీలు, వాళ్ల జీవితం ఇలాగా వుంటే On the screen ఇప్పటికి ఇంకా నా వయసు నిండా పదహారే అంటూ గంతులేస్తూ వుంటారు.

సినిమా ఎంటర్‌టైన్‌మెంట్ వ్యాపారం అనే మాటను గౌరవిస్తూనే, అది ఒక బలమయిన మాధ్యమంగా తన బాధ్యతలను తాను నిర్వర్తించాలి అంటే పెద్దగా ఎవరికీ అభ్యంతరం వుండదేమో!

హృదయవీణా తంత్రులను మీటడమూ ఎంటర్‌టైన్‌మెంట్! నాభి కింద భాగాన్ని కదిలించడమూ ఎంటర్‌టైన్‌మెంట్. మీరూ దేన్ని స్పందింపచేస్తారు అన్నదే అసలు సిసలు సమస్య. దేనికయినా సంస్కారమే అసలు కారణం.

– వంశీకృష్ణ, 9573427422

తెలుగు తెర తొలి హీరోయిన్

తొలి తెలుగు టాకీ భక్తప్రహ్లాదలో లీలావతి పాత్రను పోషించిన సురభి కమలాబాయి, ఆ చిత్రంలో రెండు పాటలను కూడా పాడారు.

కాంచనమాల

తొలితరం కథానాయికల్లో ఈమెది విశిష్ట స్థానం. అందానికే అందం కాంచనమాల అనిపించుకున్నారు. 'మాలపిల్ల'తో అభిమానుల్లో క్రేజ్ తెచ్చుకున్న ఈమె, కేవలం 12 చిత్రాల్లో మాత్రమే నటించినా ఇప్పటికీ ఆమెను తలచుకుంటున్నారంటే అతిశయోక్తి కాదు. వందేమాతరం వంటి సామాజిక స్పృహకల చిత్రాల్లో నటించారు.

భానుమతి

కేవలం నటిగానే కాక బహుముఖ ప్రజ్ఞాశాలిగా పలువురి మన్ననలు అందుకుంది. గాయనిగా, సంగీత దర్శకురాలిగా, స్టూడియో యజమానిగా, నిర్మాతగా, దర్శకురాలుగా, రచయిత్రిగా పలు పాత్రలు సమర్థవంతంగా నిర్వర్తించి పలువురిచేత శభాష్ అనిపించుకున్నారు.

అత్యుత్తమ గాయనీమణులు

తెలుగు వారిని అలరించిన అపురూప గాయనీ మణుల్లో పి.లీల స్వరం ప్రత్యేకమైనది. ఆమె గొప్ప కర్ణాటక విద్వాంసురాలు. సినిమా గాయనిగానూ అంతే పేరుపొందారు. భక్తి-రక్తి, వలపు-విరహం అన్న నాలుగు శ్రుతులనూ గాణ్యంగా పలికించిన కిన్నెరగా వాసికెక్కారు లీల. గానకోకిలగా పేరొందిన పి.సుశీల గాత్రం మాధుర్యానికి, స్వచ్ఛమైన ఉచ్చారణకి మరోపేరు. భావ ప్రకటనతో అలరించిన గాయని ఆమె. అన్ని వయసుల వారిని రంజింప చేయగల మరో గాయని ఎస్.జానకి. భావయుక్తంగా పాడే విలక్షణమైన కంఠం రావు బాల సరస్వతీదేవి దేవిది.

తొలి అడుగులు

ప్రపంచం మొత్తం మీద గర్వించదగ్గ మహిళలు మన భారతదేశంలో ఎందరో అవతరించారు. ముందుతరాల వారికి స్ఫూర్తిగా, వారిలో చైతన్యాన్ని నింపుతూ ఎందరో వనితలు చరిత్రను సృష్టించారు. అన్ని రంగాలలోనూ మగవారితో దీటుగా, ఎన్నో ఆటంకాలను ఎదుర్కొంటూనే ఓటమిని అంగీకరించకుండా, పట్టుదలతో ముందుకు నడిచి ఉన్నత స్థానాలను అధిరోహించారు. అటువంటి ప్రతిభావంతులైన మనదేశ మహిళామణుల గురించి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒక్కసారి గుర్తు చేసుకుందాం...

సావిత్రిబాయి పూలే... మహారాష్ట్రలో సతారా జిల్లా, ఖండాలా తాలుకా 'నైగాన్ అనే ఒక మారుమూల గ్రామంలో ఖండోజినవసెపా టిల్, లక్ష్మీబాయిలకు జనవరి 3, 1831లో జన్మించారు. 1848వ సంవత్సరంలో తొలి భారతీయ మహిళా ఉపాధ్యాయురాలిగా పనిచేసి చరిత్రను సృష్టించారు. సావిత్రి పూలేగారు సంఘ సంస్కర్త అయిన జ్యోతిరావ్ పూలేను వివాహమాడారు. వీరిద్దరూ కలిసి పూణెలోని బుధవార్ పేటలో మహిళలకోసం ఒక ప్రత్యేకమైన పాఠశాలను 1848వ సంవత్సరంలో నిర్మించారు. ఆనాడు సమాజంలో జరిగిన బాల్య వివాహాలు, స్త్రీ – శిరోముండనం, సతీ సహగమనం వంటి దుష్ట సంప్రదాయాలను, మహిళలకు జరిగిన అన్యాయాల గురించి నిరసిస్తూ వాటికి వ్యతిరేకంగా 'నాయీ' (మంగలి) సమాజాన్ని ఏర్పాటు చేసిన ఘనత ఈమెకే దక్కుతుంది. ప్లేగు అంటువ్యాధని తెలిసినా సేవాతత్వంతో ముందుకు సాగిన సావిత్రిబాయి అదే ప్లేగు వ్యాదితో మరణించారు.

కాదంబినీ గంగూలీ...బ్రిటిష్ ఇండియాలోని బీహార్ రాష్ట్రంలోని భగల్‌పూర్‌లో జన్మించారు. బ్రిటిష్ పరిపాలన కాలంలోని 1883వ సంవత్సరంలో కాదంబినీ గంగూలీ, చంద్రముఖి బసు ఇద్దరూ మొదటి మహిళా గ్రాడ్యుయేట్స్‌గా చరిత్రలో నిలిచిపోయారు. మహిళలు కూడా చదువులో ఏమాత్రం తీసిపోరని నిరూపించి మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు. అలాగే కాదంబినీ గంగూలీ, ఆనందినీ గోపాల్ జోషీ 1886వ సంవత్సరంలో వెస్టర్న్ మెడిసిన్‌లో శిక్షణ పొందిన తొలి భారతీయ మహిళలుగా రికార్డులకెక్కారు.

అనీబిసెంట్: 1847, అక్టోబర్ 1న జన్మించారు. 1917వ సంవత్సరంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు తొలి మహిళా అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. మహిళలకు మగవారితో సమాన హక్కులు కల్పించాలని ఎన్నో ఉద్యమాలను నిర్వహించారు. 1898వ సంవత్సరంలో కేంద్రీయ హిందూ కళాశాలను స్థాపించడంలో ఈమె ముఖ్యపాత్ర వహించారు.

పండిత రమాబాయి... 1858, ఏప్రిల్ 23న గంగమూల, కార్కాల, కర్ణాటకలో జన్మించారు. భారతదేశ సమాజ సేవలను అందించినందుకు 'కౌసర్ ఐ హింద్' మెడల్ అందుకున్న తొలి భారతీయ మహిళగా గుర్తింపును సంపాదించుకున్నారు. స్త్రీ జనరోద్ధరణకు, స్త్రీలకు విద్యను అందించాలని ఎంతోగానో కృషి చేశారు.

సరోజినీ నాయుడు... 1879, ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో జన్మించారు. బ్రిటీష్ పరిపాలన కాలంలో భారతదేశానికి స్వాతంత్ర్యం కల్పించడానికి పాటుపడిన సమరయోధురాలు. ఈమె తన కవిత్వాల ద్వారా భారత కోకిల (ద నైటింగేల్ ఆఫ్ ఇండియా)గా ప్రసిద్ధి చెందారు. 1935వ సంవత్సరంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కు తొలి మహిళా ప్రెసిండెంట్ గా ఎన్నికయ్యారు. స్వతంత్ర భారతదేశానికి తొలి మహిళా గవర్నర్‌గా చరిత్రను సృష్టించారు.

అసీమా ఛటర్జీ... 1917, సెప్టెంబర్ 23న బెంగాల్‌లో జన్మించారు. 1944వ సంవత్సరంలో యూనివర్సిటీ ఆఫ్ కలకత్తా నుంచి సైన్స్ విభాగంలో తొలిసారిగా డాక్టరేట్‌ను తీసుకున్న ఘనత ఈమెది. ఈమె ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫైటో మెడిసిన్ రంగాలలో ఎంతగానో కృషిచేసి... మలేరియా, ఎపిలెప్సీ, ఆల్కలాయిడ్లు వంటి వ్యాధులకు మందులు కనుగొనడంలో ముఖ్యపాత్రను పోషించారు.

ప్రేమ మాథుర్... 1951వ సంవత్సరంలో తొలి కమర్షియల్ ఉమెన్ పైలట్ గా వ్యవహరించి, చరిత్రలో తన పేరును నమోదు చేసుకున్నారు. దెక్కన్ ఎయిర్ వేస్‌లో తన సహాయ సహకారాలను అందించారు.

విజయలక్ష్మీ పండిట్... ఈమె అసలు పేరు స్వరూప కుమారి. 1900, ఆగస్టు 18న ఢిల్లీలో జన్మించారు. 1953వ సంవత్సరంలో యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీకి ప్రెసిడెంట్‌గా ఎన్నికయిన తొలి భారతీయ మహిళ. మంత్రి పదవిని పొందిన తొలి మహిళగా కూడా ప్రసిద్ధి చెందారు.

అన్నా చాందీ... 1905, మే 4న జన్మించారు. 1959వ సంవత్సరంలో కేరళ హైకోర్టుకు తొలి మహిళా జడ్జిగా నియమితులయ్యారు. న్యాయవాదిగా మొదలైన ఈమె ప్రస్థానం హైకోర్టు జడ్జి వరకు ఎదిగింది.

సుచేతా కృపలానీ: 1908, జూన్ 25న పంజాబ్‌లోని అంబాలాలో జన్మించారు. 1963వ సంవత్సరంలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి తొలి మహిళా ముఖ్యమంత్రిగా ఎంపికయ్యారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పాటుపడిన స్వాతంత్ర్య సమరయోధులలో ఈమె కూడా ఒకరు. అలాగే భారత రాజకీయ వ్యవస్థలో ఆనాడు జరిగిన అక్రమాలను అణచివేసింది.





దుర్గా బెనర్జీ... ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు తొలి మహిళా పైలట్‌గా గుర్తింపు పొందారు. 1966వ సంవత్సరంలో అదే ఎయిర్ లైన్స్ సంస్థలో తొలి మహిళా కెప్టెన్ గా ఎన్నికయ్యారు.

కమలాదేవీ ఛటోపాధ్యాయ... కమ్యూనిటీ లీడర్ షిప్ విభాగంలో రామన్ మెగసెసె అవార్డును 1966వ సంవత్సరంలో పొందిన తొలి మహిళగా పేరు పొందారు. గృహకుటీర పరిశ్రమల సముద్ధరణకోసం అందించిన సేవలకు గాను పద్మభూషణ్, పద్మవిభూషణ్ పురస్కారాలను అందుకున్నారు.

ఇందిరాగాంధీ... భారతదేశానికి తొలి ప్రధానమంత్రిగా 1966వ సంవత్సరంలో ఎన్నికయ్యారు. జవహర్ లాల్ నెహ్రూ కూతురయిన ఈమె.. ఆయన ప్రధానమంత్రిగా వున్నప్పుడు ఒక్క రూపాయి జీతం కూడా తీసుకోకుండా సెక్రటరీగా పనిచేశారు. అలాగే లాల్ బహుదూర్ శాస్త్రిగారి మంత్రి మండలిలో ప్రసారశాఖ మంత్రిగా కూడా వ్యవహరించారు.

కమల్ జిత్ సంధు... 1970వ సంవత్సరంలో భారతదేశం తరపు నుంచి ఏషియన్ గేమ్స్ లో పాల్గొని, గోల్డ్ మెడల్ సంపాదించిన తొలి మహిళగా రికార్డుకెక్కారు. 400 మీటర్ల గల దూరాన్ని కేవలం 57.2 సెకండ్లలోనే పూర్తి చేసి తన ప్రతిభను చాటుకున్నారు.

కిరణ్ బేడి... భారతదేశంలో గర్వించదగ్గ మహిళల్లో ఈమె ఒకరు. 1972వ సంవత్సరంలో తొలి మహిళా ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. పోలీసు శాఖలో అనేక పదవులు, సంస్కరణలను చేపట్టినందుకు మెగసెసె అవార్డులతో పాటు పలు అవార్డులు ఈమెకు వరించాయి. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ డైరెక్టర్ జనరల్ గా పనిచేస్తూ.. 2007వ సంవత్సరంలో స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు.

మదర్ థెరిసా... 1979వ సంవత్సరంలో నోబెల్ శాంతి బహుమతిని అందుకున్న తొలి భారతీయ పౌరురాలుగా తన ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా వెదజల్లారు. భారతదేశంలో వున్న పేద పిల్లలకు, మహిళలకు, వృద్ధులకు తనవంతు సహాయంగా ఆశ్రమాలను నిర్మించి, వారికి పరిచర్యలు చేశారు. 1980వ సంవత్సరంలో భారతదేశంలోనే అత్యున్నత పురస్కారమైన భారతరత్నను కూడా పొందారు.

బచేంద్రిపాల్... 1984వ సంవత్సరంలో అత్యంత ఎత్తయిన ఎవరస్టు శిఖరాన్ని అవరోధించిన తొలి మహిళగా చరిత్ర రికార్డులకెక్కారు.

ఫాతిమా బివి... కేరళ రాష్ట్రానికి చెందిన ఒక న్యాయమూర్తి. 1989వ సంవత్సరంలో సుప్రీంకోర్టు తొలి మహిళా జడ్జిగా రికార్డులను తిరగరాశారు. మన భారతదేశంలోనే అత్యున్నత స్థానం పొందిన మొదటి ముస్లిం మహిళ కూడా ఈవిడే.

ప్రియా జింగాన్... 1992వ సంవత్సరంలో ఇండియన్ ఆర్మీలో చేరిన తొలి మహిళ క్యాడెట్ గా ఈమెను సరికొత్త చరిత్రను సృష్టించారు. ఆనాటి వరకు ఆర్మీలోకి రావడానికి మగవారే భయపడుతున్న తరుణంలో... ఈమె రంగప్రవేశం చేసి మహిళలలో స్ఫూర్తిని పెంపొందించింది. మగవారికి ధీటుగానే తన సేవలను అందిస్తూ వచ్చింది.

హరితా కౌర్ డియోల్... ఇండియన్ ఎయిర్ ఫోర్స్ లో తొలి మహిళా పైలట్ గా 1994వ సంవత్సరంలో చేరి చరిత్ర రికార్డులకు ఎక్కారు.

కల్పనా చావ్లా... భారతీయ సంతతికి చెందిన వ్యోమగామి యంత్రి నిపుణురాలు అయిన ఈమె 1997వ సంవత్సరంలో అంతరిక్షంలో అడుగుపెట్టిన ఖ్యాతిని సొంతం చేసుకుని, ప్రపంచ రికార్డులకెక్కారు.

కరణం మల్లేశ్వరి : 2000 సంవత్సరంలో భారతదేశం తరపున సిడ్నీ వేసవిలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ ఒలంపిక్స్ లో కాంస్య పతకం పొందిన తొలి భారతీయ మహిళగా రికార్డును సృష్టించింది.

లక్ష్మీ సెహగల్... 2002వ సంవత్సంలో రాష్ట్రపతి పదవికి పోటీ పడిన వారిలో తొలి మహిళగా వార్తల్లోకెక్కారు. విదేశీ వస్తు బహిష్కరణ, మద్యనిషేధం వంటి జాతీయ పోరాటాలలో కూడా తనవంతు సహాయాలను అందించడంలో కృషిచేశారు. సుభాష్ చంద్రబోస్ ప్రసంగాలకు ప్రభావితులైన ఈమె స్వాతంత్ర్యోద్యమంలో "ఆజాద్ హింద్ ఫౌజ్" మహిళా దళాల్లో చేరి, కెప్టెన్ గా హోదాను సంపాదించుకున్నారు.

పునీతా అరోరా... ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్ జనరల్ గా 2004వ సంవత్సరంలో ఎంపికయిన తొలి భారతీయ మహిళగా ఖ్యాతికెక్కారు.

ప్రతిభా పాటిల్... భారతదేశ తొలి మహిళా రాష్ట్రపతిగా ఎన్నికయి చరిత్రను సృష్టించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఈమె 1962 నుంచి 1985 వరకు జల్ గావ్ జిల్లాలోని ఏద్లాబాద్ నియోజకవర్గం నుంచి మహారాష్ట్ర శాసన సభ్యురాలిగా పనిచేసింది. రాష్ట్రపతిగా ఎన్నికయ్యే ముందు రాజస్థాన్ రాష్ట్రానికి తొలి మహిళ గవర్నర్ గా పనిచేసింది.

మీరా కుమార్... లోక్ సభ స్పీకర్ కు 2009లో ఎంపికైన తొలి భారతీయ మహిళగా మీరా కుమార్ మంచి గుర్తింపును పొందారు.

ఇలా ఈ విధంగా మన భారతదేశంలో మహిళలు అన్ని రంగాలలోనూ తమ సత్తాను చాటుకుంటూ.. ఇతర మహిళలకు ఆదర్శంగా నిలిచి భారతదేశ ఉన్నతికి పాటు పడుతున్నారు.

ఇరీమ్ చాను షర్మిల... మణిపూర్ ఉక్కు మహిళగా పేరు పొందిన ఇరీమ్ చాను షర్మిల సాయుధ దళాలకున్న ప్రత్యేక అధికారాల తొలగింపు కోసం గత 14ఏళ్ళకు పైగా నిరాహారదీక్ష చేస్తూనేవుంది. ఇంతవరకు ప్రపంచంలో ఎవరూ ఇంత సుదీర్ఘకాలం పాటు నిరాహారదీక్ష చేపట్టలేదు.

– సలీమ

ఆమె అతి సాధారణ పల్లెటూరి బహుజన యువతి. ఆమెను ఆధిపత్య కుల నాగు కాపుకాసి కాటువేసింది. తనపై జరిగిన లైంగిక దాడిని ప్రపంచానికి వెల్లడించి దోషులను శిక్షించమని కోర్టుకెక్కింది ఆమె. ఏళ్లతరబడి కోర్టుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. చివరికి ప్రధానమంత్రి జోక్యం కల్పించుకున్నారు. అయినా ఉత్కంఠ రేకెత్తించే మలుపులతో సాగిన ఆమె కథ కంచికి చేరనేలేదు. కానీ ఆమె పోరాటం మాత్రం ఈ దేశంలోని కోట్లాదిమంది అభాగినులకు స్ఫూర్తినిస్తోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్ఫూర్తి ప్రదాత భన్వరీ దేవి గాథ మీ కోసం...

స్ఫూర్తినిచ్చే పోరాటం

రాజస్థాన్‌లోని అనేకానేక పల్లెటూళ్లలో అదీ ఒక ఊరు. పేరు భతేరి. రాజధాని జైపూర్‌కి యాభై అయిదు కిలోమీటర్ల దూరంలో ఎడారి ఇసుక తిన్నెల్లో ఉన్న గ్రామం ఇది. భారతదేశంలోని ఇతర పల్లెల్లాగే ఇక్కడా కులవ్యవస్థ వేళ్లూనుకుపోయింది. గుజ్జర్లు అధిక సంఖ్యలో నివసించే ఈ ఊళ్లో ఇతర కులస్తులు కూడా కొద్ది మంది ఉన్నారు. పెత్తనం అంతా గుజ్జర్లదే. పరమ ఛాందసవాదులు. వారి మాటే శాసనం. ఇదే గ్రామంలో కుండల తయారీ వృత్తిని అనుసరించే కుమ్హర్ అనే కులస్తులూ ఉన్నారు. గుజ్జర్లు తమకన్నా తక్కువ కులస్తులుగా వీరిని భావిస్తారు. అందుకే అవకాశం వచ్చినప్పుడల్లా కుమ్హర్‌లపై అరాచకాలకు పాల్పడుతూ ఉంటారు. వాళ్ల అరాచకానికి నిలువెత్తు సాక్ష్యం భన్వరీదేవి ఉదంతం.

కుమ్హర్ కుటుంబంలో పుట్టిన భన్వరీదేవి ఇంటి పనితో పాటు కుండల తయారీలోనూ మంచి నైపుణ్యం సంపాదించింది. భర్త జైపూర్‌లో రిక్షా తొక్కుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇద్దరు పిల్లలు, అత్తఆమామలు ఇదే ఆమె కుటుంబం. భన్వరీ దేవిలో అణుకువతో పాటు.. అన్యాయాన్ని ఎదురించే తత్వమూ ఉంది. ఆ లక్షణమే ఆమెను ఇక్కట్ల పాలు చేసింది. కేవలం సంతకం పెట్టడం మాత్రమే నేర్చుకున్న భన్వరీకి నిజానికి చదువు సంధ్యలు లేవు. అయితే ఏం.. సమాజంలో ఉండే అవలక్షణాలను ఎదిరించే గుండె ధైర్యం ఆమె సొంతం. ఆ రోజుల్లో ప్రభుత్వం.. మహిళా అభివృద్ధి ప్రాజెక్టునొకదాన్ని చేపట్టింది. అందులో ప్రచేత హోదాలో పనిచేసే ఒక మహిళా అధికారికి భన్వరీ తెగువ గురించి తెలిసింది. ఒకరోజు ఆమెను వెదుక్కుంటూ ఇంటికి వచ్చింది. తమ ప్రాజెక్టులో సాథిన్‌గా చేరమని ఆహ్వానించింది. సాథిన్ అంటే స్నేహితురాలని అర్థం. భూమి, నీరు, అక్షరాస్యత, ఆరోగ్యం వంటి విషయాల్లో మహిళలను చైతన్యపరచడం సాథిన్ ప్రధానమయిన విధి. ముందు సాథిన్‌గా చేరడానికి అంగీకరించకపోయినా.. ఆర్థిక పరిస్థితులు విషమించడంతో చివరికి చేరింది.

1987లో భన్వరీదేవి నివసిస్తున్న గ్రామం పక్కనే ఉన్న ఊర్లో గుజ్జర్ ఒకడు ఓ యువతిపై అత్యాచారయత్నం చేశాడు. ఈ సంగతి భన్వరీదేవి దృష్టికొచ్చింది. వెంటనే తన సహచర సాథిన్‌ల తోడ్పాటుతో గ్రామంలోని ఇతర ఆడ కూతుళ్లను ఏకం చేసింది. నిందితుడు బయటికి వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ అతడి ఇంటికి ప్రదర్శనగా వెళ్లింది. నేరస్తుడు తప్పించుకుని పారిపోవడంతో వెనుతిరిగింది. ఈ సంఘటన గురించి చుట్టుపక్కల గ్రామాలకు తెలిసింది. గుజ్జర్లు వెంటనే ఎలర్ట్ అయ్యారు. భన్వరీ దేవి స్వగ్రామం భతేరీలో నేరస్తుని బంధువులున్నారు. అందుకే అక్కడ గుజ్జర్ పెద్దలు సమావేశమయ్యారు. సాథిన్‌లు చేపడుతున్న కార్యకలాపాల వల్ల తమ పరువు బజారుపాలవుతోందనే అవగాహనకు వచ్చారు. వారిని ఎలా కట్టడి చేయాలో పథకాలు రచించారు.

సాంఘిక బహిష్కరణ

రాజస్థాన్‌లో బాల్య వివాహాలు ఎక్కువ. ముక్కుపచ్చలారని పిల్లలకు పెళ్లిళ్లు చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. ప్రతి ఏడాది అక్షయ తృతీయ పర్వదినాన ఈ పెళ్లిళ్లు ఎక్కువగా జరుపుతారు. అందుకే 1992లో ఆ పర్వదినానికి పదిహేనురోజుల ముందు నుంచే రాజస్థాన్ ప్రభుత్వం బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ ప్రచారాన్ని చేపట్టింది. ఈ ప్రచార కార్యక్రమంలో సాథిన్లనూ భాగస్వాములను చేసింది. దీంతో భన్వరీ దేవి కూడా తన సహచరులతో కలిసి స్థానికులకు నచ్చచెప్పే ప్రయత్నం చేసింది. అయినా ఆమె మాటలను పట్టించుకోకుండా రామ్‌కరన్ అనే గుజ్జర్ తన తొమ్మిది నెలల పాపకు పెళ్లి తలపెట్టాడు.

ఈ సంగతి తెలిసిన పోలీసులు రామ్‌కరన్ ఇంటికి వచ్చారు. పెళ్లి ఆపాల్సిందేనని వత్తిడి చేశారు. ఆ రోజున పెళ్లి జరగడం ఆగిపోయింది. కానీ మరుసటి రోజు రాత్రి రెండు గంటలకు దిగ్విజయంగా వివాహం ముగిసిపోయింది. వివాహ విషయంలో పోలీసుల జోక్యానికి భన్వరీ దేవే కారణమై ఉండవచ్చని గుజ్జర్లు భావించారు. అందుకే ఆమె ఇంటిపై దాడి చేశారు. భన్వరీని తీవ్రంగా భయపెట్టారు. ఇక నుంచి ఆ కుటుంబానికి పాలు నీళ్లు ఎవరూ ఇవ్వరాదని హుకుం జారీ చేశారు. అంటే సంఘ

బహిష్కరణ చేశారన్న మాట. ఇప్పుడు భన్వరీ .. నీళ్ల కోసం మైళ్ల దూరం ఇసుక పర్రల్లో నడిచి వెళ్ళి రావాల్సి వస్తోంది. ఇక ఇంటికి కావలసిన పాల కోసం ఒక గేదెను కొనాలని నిర్ణయించింది భన్వరీ. ప్రచేతి అప్పుగా ఇచ్చిన డబ్బులతో పాడి గేదెను కొనుక్కు వచ్చింది.

అమానుషం

1992 సెప్టెంబర్ 22. భన్వరీ దేవి ఆమె భర్త పొలంలో పనిచేసుకుంటున్నారు. అప్పటికే చీకటిపడుతోంది. భర్త మోహన్‌లాల్ కాస్త ఇవతలికి వచ్చి మూత్ర విసర్జన చేస్తున్నాడు. ఇంతలో అతడిపై దాడి జరిగింది. రామ్ కరన్ గుజ్జర్, రామ్ సుఖ్ గుజ్జర్, గ్యార్సా గుజ్జర్ , బద్రీ గుజ్జర్, శ్రావణ్ శర్మ అనే వారు ఈ దాడిలో పాల్గొన్నారు. మోహన్‌లాల్ అరుపులు విన్న భన్వరీ పరుగెత్తుకువచ్చి అడ్డుపడింది. అసలు దారుణానికి తెరలేచిందిప్పుడే. అందరూ ఒకరి తరువాత ఒకరు భర్త కళ్లముందే ఆమెను బలాత్కరించారు.

జరిగిన దారుణం గురించి ప్రచేతికి తెలియజేశారు దంపతులు. ఆమె వారిని బస్సి పోలీస్ స్టేషన్‌కు తీసుకుపోయి ఫిర్యాదు చేయించింది. కానీ డిఎస్‌పి... భన్వరీ కథనాన్ని నమ్మలేదు. అందుకే వైద్య పరీక్షల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లమని చెప్పాడు. భారతీయ చట్టాల ప్రకారం అత్యాచారానికి గురయిన మహిళకు మహిళా డాక్టర్లే వైద్య పరీక్ష నిర్వహించాలి. కానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఇద్దరు మహిళా వైద్యులు అందుబాటులో లేరు. అందుకే పురుష వైద్యుడు ఆ పని నిర్వర్తించడానికి తిరస్కరించాడు. బన్వరీని జైపూర్‌లో ఉన్న సవాయ్ మాన్‌సింగ్ ఆసుపత్రికి పంపాడు. అక్కడి డాక్టర్లను వైద్య పరీక్షలు చేసి ఆమె వయసును నిర్ధారించమని కోరుతూ ఒక నోట్ పంపాడు. జైపూర్ ఆసుపత్రిలో ఉన్న మెడికల్ జూరిస్ట్ .. మేజిస్ట్రేట్ ఆర్డర్ లేకుండా తాను ఆ పని నిర్వర్తించలేనని తేల్చి చెప్పాడు. హడావిడిగా మేజిస్ట్రేట్ దగ్గరికి వెళ్లారు. అప్పటికే కోర్టు సమయం అయిపోవడంతో జడ్జి మరుసటిరోజు కానీ ఉత్తర్వులు ఇవ్వడానికి సమ్మతించలేదు. మరుసటి రోజు ఉదయం కేవలం మామూలు వైద్య పరీక్షల నిమిత్తమే జడ్జి ఉత్తర్వులిచ్చారు. అఘాయిత్యం జరిగిన యాభై రెండు గంటలకు కానీ భన్వరీ దేవి నుంచి వేజినల్ స్వాబ్ శాంపిల్‌ను తీయలేదు. నిజానికి అత్యాచారం జరిగిన 24 గంటల లోపే ఈ పని పూర్తి కావాలి.

కోర్టులో సాక్ష్యంగా సమర్పించేందుకు భన్వారీ లోదుస్తులను తమకు ఇవ్వమని పోలీసులు అడిగారు. అవిస్తే కట్టుకోవడానికి మరో లెహంగా లేదు. చివరికి తన భర్త తలపాగా చుట్టుకుని లోదుస్తులను పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్ చేసింది భన్వరీ. అప్పటికే రాత్రి 12 గంటలు దాటింది. పచ్చిపుండు లాంటి దేహానికి కేవలం భర్త తలపాగా చుట్టుకుని అక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక సాథీ గ్రామానికి నడుచుకుంటూ వెళ్లి ఆ రాత్రి తలదాచుకుంది. భన్వరీ దేవిపై జరిగిన అత్యాచారం పత్రికల్లో రావడం ప్రారంభమయింది. దీంతో మహిళా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఆమెకి అండగా వీధుల్లోకి వచ్చాయి. అసలేం జరిగిందనే విషయంపై అనేక మంది పరిశోధన ప్రారంభించారు. ఇదే సమయంలో అత్యాచారం చేసిన వారు, వారి అనుచరగణం.. రకరకాల పుకారులను ప్రచారం చేశారు. భన్వరీ దేవి బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు గుంజడానికే ఈ రేప్ కథను అల్లిందనే ప్రచారం అందులో ఒకటి. జనం చాలా మంది ఈ ప్రచారాన్నీ నమ్మారు. అందుకే స్వగ్రామంలోనే ఆమెకి లభించాల్సిన సానుభూతి లభించకపోగా అవమానాలూ ఎదురయ్యాయి. ఇదే సమయంలో స్వగ్రామం బయట భన్వరీ దేవికి విశేషమయిన మద్దతు లభించింది. చివరికి అత్యాచారం జరిగిన రెండేళ్లకు గానీ దిగువ కోర్టులో ఆమె కేసు విచారణకి నోచుకోలేదు.

అనేక స్వచ్ఛంద సంస్థల పుణ్యమా అని భన్వరీ దేవి కేసు ఢిల్లీ పీఠాన్ని కూడా కదిలించింది. ఢిల్లీకి చెందిన ఒక సంస్థ ప్రతినిధులు ప్రచేత పిలుపు మేరకు భన్వరీ దేవి గ్రామాన్ని సందర్శించారు. జరిగిన ఘటన పూర్వాపరాలు తెలుసుకుని " నీ వెనుక మేం ఉన్నాం " అని భన్వరీకి భరోసా ఇచ్చారు. వెంటనే మైనారిటీ కమీషన్, సోషల్ వెల్ఫేర్ మంత్రిత్వ శాఖ, ప్రధానమంత్రి కార్యాలయం వంటి ముఖ్యమయిన ప్రభుత్వాంగాల నుంచి వచ్చిన ప్రతినిధులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసిందా స్వచ్ఛంద సంస్థ. సంఘటన జరిగి రెండేళ్ళు గడుస్తున్నా కనీసం నేరస్థులపై చార్జిషీట్‌నైనా ఫైల్ చేయని ప్రభుత్వ నిష్క్రియా పరత్వాన్ని ఆ సమావేశంలో ఎత్తి చూపారు. దీంతో కేంద్రంలో కదలిక వచ్చింది. భన్వరీకి

భన్వరీ దేవిపై జరిగిన అత్యాచారం పత్రికల్లో రావడం ప్రారంభమయింది. దీంతో మహిళా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఆమెకి అండగా వీధుల్లోకి వచ్చాయి. అసలేం జరిగిందనే విషయంపై అనేక మంది పరిశోధన ప్రారంభించారు. ఇదే సమయంలో అత్యాచారం చేసిన వారు, వారి అనుచరగణం.. రకరకాల పుకారులను ప్రచారం చేశారు. భన్వరీ దేవి బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు గుంజడానికే ఈ రేప్ కథను అల్లిందనే ప్రచారం అందులో ఒకటి.

అన్ని రకాల సహాయం అందించడానికి ప్రభుత్వం నుంచి హామీ వచ్చింది. దీంతో స్వచ్ఛంద సంస్థ నుంచి భన్వరీకి ఢిల్లీ నుంచి పిలుపువచ్చింది. ప్రచేతతో కలిసి భన్వరీ ఢిల్లీ వెళ్లింది.

ఈ పరిణామాలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలిస్తున్న భన్వరీపై అత్యాచారం చేసిన దుర్మార్గులు స్థానిక ఎమ్మెల్యేని కలిసి ఎలాగయినా ఈ గండం నుంచి బయటపడవేయమని వేడుకున్నారు. ఆ ఎమ్మెల్యే గుజ్జర్ కులస్తుడే. ఈ కేసు నుంచి వారిని రక్షించలేకపోతే తన ఓటు బ్యాంకు దెబ్బతింటుందని అతడు బలంగా నమ్మాడు. అందుకే నేరస్తులకు అభయం ఇచ్చి తను పావులు కదపడం ప్రారంభించాడు.

అక్కడ ఢిల్లీలో ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ప్రధాన మంత్రి పి.వి. నరసింహారావు హాజరయ్యారు. ఈ సమావేశానికి కేంద్ర బిందువు భన్వరీ దేవే. ఆమెకి జరిగింది ముమ్మాటికీ అన్యాయమే అని వక్తలందరూ ఒక్కాణించారు. ప్రధానమంత్రి కొంత ధన సహాయం ప్రకటించారు. అదే సమయంలో ఆమె ధైర్య సాహసాలనూ కొనియాడారు. సిబీఐని ఆమె కేసు చేపట్టమ్మని అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. " నాకు న్యాయం చేయండి అంతే చాలు"ని భన్వరీదేవి ముకుళిత హస్తాలతో ఆ సమావేశంలో వేడుకుంది.

ప్రధానమంత్రి ఆదేశాలపై సీబీఐ రంగంలోకి దిగి నిందితులను అరెస్ట్ చేసింది. 1994లో భన్వరీదేవి కేసు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణకు వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే నిందితుల కోసం తిమ్మిని బమ్మి చేయగల లాయర్‌ని ఏర్పాటు చేశాడు. వాదోపవాదాలు నడుస్తున్నాయి.

అయిదుగురు నిందితుల్లో ముగ్గురికి ప్రాథమిక విచారణ దశలోనే బెయిలు మంజూరు చేసింది కోర్టు. ఇద్దర్ని మాత్రమే జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించింది. బెయిల్ పొందిన నిందితులు భన్వరీ దేవితో బేరసారాలకు దిగారు. డబ్బులిస్తామని.. కేసు ఉపసంహరించుకోమని ఆమెను కోరారు. తనకు డబ్బు అవసరం లేదని.. గ్రామస్తులందరి ముందు తనపై అత్యాచారం చేసినట్లు ఒప్పుకుంటే కేసు ఉపసంహరించుకుంటానని ఆమె బదులిచ్చింది. దీంతో వారు కోపంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. స్థానిక ఎమ్మెల్యే తన శక్తి సామర్థ్యాలను ఉపయోగించి జడ్జీల బదిలీకి పాల్పడుతూ వచ్చాడు. కారణాలేవయితేనేం.. ఏడాదికాలంలో మొత్తం అయిదుగురు జడ్జీలు బదిలీ అయిపోయారు. ఆరవ జడ్జీ చివరికి 1995లో తీర్పు ఇచ్చాడు. ఆ తీర్పులో నిందితులు నిర్దోషులని తేల్చాడు. వారు అత్యాచారం చేస్తున్నప్పుడు చూసిన ప్రత్యక్ష సాక్షులు ఎవరూ లేకపోవడం... అత్యాచారం జరిగిందని నిర్ధారించడానికి అవసరమైన వైద్య పరీక్షల నివేదిక .. భన్వరీకి ప్రతికూలంగా రావడం నిందితులను నిర్దోశులుగా వదలడానికి ప్రధాన కారణాలు.

సంఘటన జరిగిన 52 గంటల తరువాత భన్వరీపై వైద్య పరీక్షలు నిర్వహించడం వల్ల ప్రయోజనం లేకుండా పోయింది. అసలు అలా ఆలస్యంగా వైద్యపరీక్షకు వెళ్లడాన్ని జడ్జి తప్పు పట్టాడు. అగ్రకులస్తులు నిమ్న కుల మహిళలపై అత్యాచారం చేయరని జడ్జి సూత్రీకరించాడు. భన్వరీ దేవిని బలాత్కరిస్తుంటే భర్త కళ్లప్పగించి ఎలా చూస్తూ ఊరుకున్నాడని ప్రశ్నించాడు. ఆమె కావాలనే నిందితులను కోర్టుకు లాగిందనే భావం జడ్జి తీర్పులో వ్యక్తమయింది.

నిందితుల తరపున పోరాడిన ఎమ్మెల్యే రాజధాని జైపూర్‌లో వారి విడుదల సందర్భంగా విజయయాత్ర నిర్వహించాడు. కోర్టు తీర్పు పట్ల దేశ వ్యాప్తంగా నిరసన జ్వాలలు తలెత్తాయి. చివరికి రాజస్థాన్ ప్రభుత్వం భన్వరీ దేవి తరపున హై కోర్టులో అప్పీల్ చేసింది. అత్యాచారం జరిగిన పదిహేనేళ్లకు 2007లో రాజస్థాన్ హైకోర్టులో కేసు విచారణకు వచ్చింది. ఒకేసారి హియరింగ్ జరిగింది. కేసు కొనసాగుతుండగానే ఇద్దరు నిందితులు మరణించడంతో ఎటూ తేలకుండానే కథ ముగిసిపోయింది.

అలా మన చట్టాలు, న్యావ్యవస్థలోని లొసుగులు, లంచగొండితనం, ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి, ఆధిపత్యకుల దురహంకారం వంటి అనేక కారణాల వల్ల కొందరు నిందితులు నిర్దోషులుగా బయటపడితే.. మరికొందరు జైలు శిక్ష పడకుండానే చనిపోయారు. ఎటువంటి న్యాయం దక్కని భన్వరీ అలిసిపోలేదు. కుంగిపోనూ లేదు. అలుపెరగక తన చుట్టుపక్క గ్రామాల్లో మహిళా సాధికారత కోసం పాటుపడుతూనే ఉంది. ఇప్పుడు ఆమె కోట్లాది మంది భారతీయ స్త్రీలకు ఓ స్ఫూర్తి ప్రదాతగా నిలిచిపోయారు.

– కె.వి.పద్మలత

శ్రామిక మహిళా ఉద్యమ ధృవతారలు

క్లారా జట్కిన్ :

ప్రఖ్యాత కమ్యూనిస్టు నేత. అంతర్జాతీయ శ్రామిక ఉద్యమానికి ఆద్యురాలు. కార్మిక వర్గ సమస్యలపైన ప్రపంచ శాంతి కోసం విశేష కృషి చేశారు. జర్మన్ పార్లమెంట్ సభ్యురాలు కూడా. మార్క్స్ కుమార్తె లారా లాఫార్గ్, ఎంగెల్స్, ఆగస్ట్ బెబెల్, రోజా లగ్జెంబర్గ్‌తో కలిసి పనిచేశారు.

రోజా లగ్జెంబర్గ్ :

జర్మనీలో ప్రఖ్యాత కార్మికోద్యమ నాయకురాలు. పోలిష్ జాతీయురాలు. జాతీయంగానే గాక, అంతర్జాతీయంగా కూడా కార్మికవర్గ ఐక్యత కోసం రాజీలేని పోరాటం చేసింది. ఒక దేశ కార్మికురాలు మరో దేశ కార్మిక వర్గంతో యుద్ధం చేసి నాశనం కావద్దని, ప్రపంచ యుద్ధాలకు వ్యతిరేకంగా పోరాడింది. జర్మన్ ఫాసిస్టులు రోజా లగ్జెంబర్గ్‌ను, మరో నాయకుడు కార్ల్ లీబ్‌నెక్ట్‌ను హత్య చేశారు.

అలెగ్జాండ్రా కొల్లంతాయ్ :

ప్రథమ సోషలిస్టు దేశం సోవియట్ యూనియన్‌లో ప్రథమ మహిళా మంత్రి. ప్రపంచంలో మొట్టమొదటి మహిళా రాయబారి కూడా. అంతర్జాతీయ మహిళా దినోత్సవ నిర్వాహకుల్లో ఒకరు. కార్మిక ఉద్యమంలో అంతర్భాగంగా కుటుంబంలో స్త్రీ సమాన హక్కుల సమస్యను పరిష్కరించడంలో విశేష కృషి చేశారు.

నాదెజ్డా కృపస్కయా :

రష్యాలో శ్రామిక మహిళల్ని సంఘటితం చేశారు. కార్మికుల్ని విజ్ఞానవంతుల్ని చేయడంలో గొప్ప కృషి చేశారు. శ్రామిక మహిళ పత్రిక నడిపారు. ప్రప్రథమ సోవియట్ ప్రభుత్వం స్త్రీల హక్కుల్ని కాపాడడంలో, తల్లిపిల్లల సంరక్షణ బాధ్యత తీసుకోవడంలో ఆమెది ప్రముఖ పాత్ర.

సుశీల గోపాలన్ :

చదువుకునే రోజుల్లోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 18 సంవత్సరాల వయసులో కొబ్బరి పీచు కార్మికుల్లో పనిచేశారు. చనిపోయే వరకు పీచు కార్మికుల సంక్షేమం కోసం పనిచేశారు. సిఐటియు ఉపాధ్యక్షురాలు కూడా. ప్రముఖ పార్లమెంటేరియన్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ప్రధాన కార్యదర్శిగా చాలా కాలం పనిచేశారు. కేరళ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా కూడా వున్నారు. కాన్సర్‌తో చనిపోయారు.

మోటూరు ఉదయం :

ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం కార్యదర్శిగా 18 సంవత్సరాలు పనిచేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘంలో ఉపాధ్యక్షురాలుగా వున్నారు. ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి. మహిళా సమస్యలపై కళారూపాలు తయారుచేసి విస్తృతంగా మహిళల్లో ప్రచారం గావించారు.

■ సంగీతం

ప్రతి మహిళా బహుముఖ ప్రజ్ఞాశాలే. ఆమె చేయలేని పని లేదు. అడుగిడని చోటు లేదు. అసలు స్త్రీ లేని సమాజమే లేదు. అన్ని రంగాల్లో ఉన్న ఆమె సినిమాల్లోనూ తనదైన స్థానం సంపాదించుకుంది. మొదట్లో స్త్రీ పాత్రలను కూడా పురుషులే ధరించేవారు. కొంతకాలానికి స్త్రీ పాత్రలను స్త్రీలే పోషించి మెప్పించారు. తర్వాతి కాలంలో మహిళ ప్రధాన పాత్రలతో సినిమాలు చాలానే వచ్చాయి. ప్రేక్షకాదరణ పొందాయి. అలనాటి కన్నాంబ నుండి నేటి అనుష్క వరకు ఎందరో కథానాయికలు సినిమా రంగంలో తమదైన ముద్రవేసుకుని ప్రేక్షకులను మెప్పించారు. కొందరు కేవలం గ్లామర్‌తో కొద్దిరోజులకే తెరమరుగైనవారూ ఉన్నారు. సినిమాల్లో మహిళల ప్రాధాన్యతను గుర్తించే పాటలు పెద్దగా లేకపోయినా, ఆమె కష్టాలు, ఇష్టాలగురించి తెలిపే పాటలు కొన్ని...

ఆమె పాటకు చోటు లేదా?

ఎన్టీఆర్, ఏయన్నార్, సావిత్రి, జమున నటించిన 'గుండమ్మ కథ' చిత్రంలో "లేచింది నిద్ర లేచింది మహిళా లోకం దద్దరిల్లింది పురుష ప్రపంచం..." అనే పాట ఈనాటికీ మనందరం వింటూనే ఉన్నాం. ఇందులో మహిళాలోకం నిద్ర లేచిందని, గల్లీ నుండి ఢిల్లీ దాకా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి వెళ్తున్నారని, అన్నింటా మగవారితో పోటీకి దిగి భర్తలతోనే పోటీచేశారని, విడాకుల చట్టం తెచ్చుకున్నారని ఓ పక్క పొగుడుతూనే మరో పక్క మగధీరులని ఎదిరించి, నిరుద్యోగులను పెంచారంటారు పింగళిగారు. ఇక్కడ గుర్తించాల్సిన అసలు విషయం ఏంటంటే భర్తలమీద పోటీ చేసే మగువలు, వారి ప్రోత్సాహంతోనే పోటీ చేస్తున్నారని, తర్వాత వారి స్థానం తెర వెనుకే అనేది వాస్తవం.

మాతృస్వామ్య సమాజం నుండి పితృస్వామ్య సమాజంలోకి వచ్చాక ఆమె ప్రాధాన్యత క్రమంగా తగ్గుతూ వచ్చింది. చివరికి ఆమెకి ఒక మనసు, దానికో అభిప్రాయం, ఇష్టాయిష్టాలుంటాయని కూడా గుర్తించడం మానేశారు. ఆమె మాటల్లో, చేతల్లో తన ఇష్టాయిష్టాలను తెలియజేసినా గుర్తించలేకపోతే ఆ యువతికి మిగిలేది బాధే. తనేమీ రాయిరప్పను కాదని, మనిషినేనని, తనకూ ఒక మనసుంటుందని, దానితో వేళాకోళం ఆడితే మనసు విరిగిపోతుందని చెప్పే పాట 'మూగమనసులు' చిత్రంలో ఆత్రేయ సాహిత్యాన్ని సుశీల ఆలపించిన "మానూ మాకును కాను రాయీ రప్పను కానే కాను.. మామూలు మణిసిని నేను" పాట. దీనికి కె.వి.మహదేవన్ సంగీతం అందించారు.

వెంకటేష్, సౌందర్య నటించిన 'పవిత్రబంధం' చిత్రంలో కె.జె.ఏసుదాసు పాడిన "కార్యేషుదాసి కరణేషు మంత్రి భోజ్యేషుమాత శయనేషు రంభ.. అపురూపమైనదమ్మ ఆడజన్మ ఆ జన్మకు పరిపూర్ణత ఇల్లాలమ్మా" పాటలో మగవారికి కష్టనష్టాలు ఎదురైనప్పుడు సేవలు చేసి సహాయకారిగా ఉన్న భార్య జన్మకు సార్థకత చేకూరుతుందని, అలా చేసిన వాళ్ళే పరిపూర్ణ ఇల్లాలు అవుతుందని మహిళని ఆకాశానికెత్తే పురుషులు ఆమె తనలో సగభాగం... ఆమె ఆలోచనలకు గౌరవం ఇవ్వాలనే సత్యాన్ని గుర్తించిన వాళ్ళెంతమంది ఉన్నారు?

ఆడపిల్లకి తండ్రి తర్వాత అంతటి ప్రేమ ఆప్యాయతని పంచి భద్రతనిచ్చేది అన్న. అనాది కాలం నుండి ఆడపిల్లమీద ఉండే ఆంక్షలను దరి చేరనీకుండా స్వేచ్ఛగా పెరగనిచ్చి ప్రాణప్రదంగా చూసుకునే అన్న ఉన్న ఏ చెల్లైనా అంతకంటే కోరుకునేది ఇంకేమీ ఉండదు. ఆర్.నారాయణమూర్తి నటించిన 'ఒరేయ్ రిక్షా'లో అన్న తన చెల్లికి "మల్లె తీగకి పందిరివోలె మస్క సీకటిలో వెన్నెల వోలె నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా తోడబుట్టిన రుణం తీర్చుకుంటనే చెల్లెమ్మ" అని వాగ్దానం చేస్తే అంత చెల్లెలికి కావాల్సిందేముంది!

ఒక సాధారణ మహిళ జీవితం ఎన్ని ఒడుదుడుకులతో ఉంటుందో చూడాలంటే దాసరి నారాయణరావు, జయసుధ, రమ్యకృష్ణ నటించిన 'కంటే కూతుర్నే కను' చిత్రంలో సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించిన "ఆడకూతురా నీకు అడుగడుగునా వందనం, అనునిత్యం కరుగుతున్న నీవు రక్త చందనం, మహారాజులే మగాళ్ళు అందరు, తెల్లవారినా నిద్ర లేవరు" పాట చూడాల్సిందే. ఈ పాటను వందేమాతరం శ్రీనివాస్ సంగీత సారథ్యంలో చిత్ర పాడారు. దేశంలో ఏ కొందరి జీవితమో ఇలా ఉందనుకుంటే పొరపాటే. ఏ కొద్దిమందికో తప్పితే, చదువుకుని, ఉద్యోగాలు చేసి సంపాదించే మహిళల జీవితాలుకూడా ఇందుకు మినహాయింపు కాదు. కుటుంబానికి అసరాగా వుండి పూర్తి బాధ్యతలు తీసుకున్నా, లింగ వివక్ష వల్ల మహిళకు సంతోషకరమైన జీవితం అడియాశే.

ఆడపిల్ల పుట్టిన ఊరు, తల్లిదండ్రులు, తోబుట్టువులు, బంధుమిత్రులందరినుండి పెళ్ళి అనే బంధంతో దూరమవుతుంది. పుట్టింటివారికి, అత్తింటివారికి మధ్య మాట తేడా వచ్చి రాకపోకలు ఆగిపోయినంతమాత్రాన ఆడకూతురి మనసులోని ఆలోచనలు, పుట్టింటి మీద ప్రేమ అంతరించిపోవుగా. అయినా మనసులో వున్న పుట్టింటివారి మీద ప్రేమ మెట్టినింటి వారి ముందు బయటపెట్టలేదు. తన సామర్థ్యంతో అత్తింటివారిని ఎంతగా మెప్పించినా, వారి అనుమతి లేకుండా ఎక్కడికీ కదలలేదు. మళ్ళీ పుట్టింటి నుండి ఎవరో ఒకరు వచ్చి ముందడుగు వేస్తే తప్ప... అక్కినేని నాగేశ్వరరావు, మీనా నటించిన 'సీతారామయ్య గారి మనవరాలు' చిత్రంలో చిత్ర పాడిన "కలికి చిలకల కొలికి మాకు మేనత్త కలవారి కోడలు కనకమాలక్ష్మి అత్తమామల కొలుచు అందాల అతివ పుట్టిల్లు ఎరుగని పసి పంకజాక్షి" .

"ఆడువారి మాటలకు అర్థాలే వేరులే, మల్లె తీగ వంటిది మగువ జీవితం, ఆడజన్మన్నదే పాపం, ఆడాళ్ళూ మీకు జోహార్లు..." ఇలా మహిళలని పొగుడుతున్నారో, తెగుడుతున్నారో అర్థం కాకుండా, మహిళలంటే ఇలాగే ఉండాలి అని గిరి గీసి చెప్పే పాటలే తప్ప 'పెళ్లాం చెబితే వినాలి, కలెక్టర్ గారి భార్య' వంటి చిత్రాల్లో చెప్పిన విధంగా ఆడవాళ్ళని గౌరవించి, వారి ఉన్నతిని తెలిపే విధంగా వచ్చే పాటలను వేళ్ళమీద లెక్కపెట్టొచ్చు. అలాగే సినిమా పరిశ్రమకి సంబంధించి మహిళల స్థానం ఎక్కువగా గ్లామర్‌కే పరిమితమైంది. నిర్మాణం, దర్శకత్వం, కొరియోగ్రఫీ, సంగీత దర్శకత్వ రంగాల్లో ఉన్నారు కానీ ఒక్క మహిళ పేరు కూడా పాటల రచయితగా రాలేదు. సినీరంగంలో ఆమె పాటకు చోటు లేదా?!

– బి.మల్లేశ్వరి

■ ఇంటర్వ్యూ

చారిత్రక కట్టడాలు, పార్కులు, రాజభవనాలు, ముత్యాల షాపులు, ప్రకృతి సౌందర్యం ఒకటేమిటి... హైదరాబాదుకు వన్నె చిన్నెలు అద్దిన ప్రత్యేకతలు ఎన్నో. అలాంటి హైదరాబాద్‌లో పుట్టిపెరిగిన అనురాధారెడ్డికి సహజంగానే నగరం అంటే విపరీతమైన అభిమానం. ఇక భారతీయ చారిత్రక వారసత్వ కట్టడాల పరిరక్షణకు పాటుపడే 'ఇన్‌టాక్' హైదరాబాద్ చాప్టర్ కన్వీనర్‌గా ఇంకా ఎంత మక్కువ, బాధ్యతతో ఉంటారో వేరే చెప్పాలా? ఆర్కియొలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా,, రాష్ట్ర పురావస్తుశాఖలతో కలిసి ఆమె ఎన్నో చారిత్రక వారసత్వ కట్టడాల పరిరక్షణకు కృషి చేశారు. 'ఇంటాక్ ' బాధ్యురాలిగా ప్రజల్లో ఈ దిశలో ఎంతో ఎవేర్‌నెస్ తీసుకువస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్, దాని చారిత్రక సంపదకు ఆమె అంతరంగంలో ఉన్న స్థానం ఆమె మాటల్లోనే చదవండి...

పరిరక్షణకే మొదటి ప్రాధాన్యం

హైదరాబాద్ భౌగోళిక, సాంస్కృతిక వ్యవహారాలు ఎంతో భిన్నంగా ఉంటాయి. ఈ ప్రాంతాన్ని అనేక మంది పరిపాలించారు. కుతుబ్ షాహీలు అనేక చారిత్రక కట్టడాల నిర్మాణం చేశారు. కులీ కుతుబ్ షా అల్లుడు హుస్సేన్ మంచినీటి అవసరాల కోసం హుస్సేన్ సాగర్‌ను (1562) నిర్మించాడు. అతని పేరుతోనే హుస్సేన్‌సాగర్‌గా నాటి నుండి పిలవబడుతుంది. కుతుబ్ షాహీలు నిర్మించిన ఈ నగరం తొలుత చించలం (ఇప్పుడు శాలిబండ) పేరుతో చిన్న గ్రామంగా ఉండేది. 1590లో కలరా మహమ్మారి సోకి గోల్కొండ నగరం అతలాకుతలమయింది. దాంతో కులీ కుతుబ్ షా తాత్కాలికంగా చించలంలో బసచేశారు. వ్యాధి బెడద తగ్గిన తర్వాత తిరిగి గోల్కొండకు వెళ్తూ తన బసకు గుర్తుగా 1591లో చార్మినార్ నిర్మించాడు. ఆ తర్వాత 1594లో గోల్కొండ కోట నుంచి 8మైళ్ళ వరకు కొత్త నగరాన్ని విస్తరింపచేశారు. దీన్నే భాగ్యనగర్, హైదరాబాద్ అని కూడా అంటారు. ఇది గోల్కొండకు రాజధానిగా మారింది. ఎన్నో ఉద్యానవనాలకు, సరస్సులకు హైదరాబాద్ పెట్టింది పేరు.

ఆ తర్వాత నిజాం కాలంలో కూడా కుతుబ్ షాహీల వలే అభివృద్ధికి బాటలు వేశారు. ఆసఫ్ జా వారసులు నిజాంలు. వీరు సాహిత్యం, కళలు, వాస్తుశిల్పం, సంస్కృతి, ఆభరణాలు, ఆహారపు అలవాట్లను అభివృద్ధి పరిచారు. వీరి కాలంలో మతం గుర్తింపు కేంద్రంగా మారింది. అది వారి కట్టడాలు, సంస్కృతిలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. పర్షియన్ కళలను, ఆర్కిటెక్చర్‌ను, సంస్కృతిని ఆదరించారు. అంతేకాదు, సాంకేతికాభివృద్ధి... అంటే విద్యుత్, రైల్వే రహదారులు, సమాచార వ్యవస్థ అభివృద్ధికి కృషిచేశారు. అంతేకాదు, విద్యాభివృద్ధికే ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని నిర్మించారు. నిజాంసాగర్, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ వంటి పెద్దపెద్ద జలాశయాలను ఆ కాలంలోనే నిర్మించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రణాళిక కూడా వీరికాలంలోనే జరిగింది. ఇలా దేశానికి స్వాతంత్ర్యం లభించే నాటికి హైదరాబాద్ సకల వసతులు కల రాజధాని.

ఎన్నో సాంస్కృతిక నేపథ్యాలున్నాయి హైదరాబాద్ సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వానికి పెట్టింది పేరు. పోచంపల్లి, కొత్తకోట, గద్వాల్, దుబ్బాక, పెంబర్తి బ్రాసో వంటి చేనేతకు, నిర్మల్ పెయింట్స్, పెరియాల్ పెయింటింగ్స్ లాంటి హస్తకళలకు, గజల్స్‌కు, నాట్యానికి, ప్రాంతీయ పండుగలకు ప్రసిద్ధి. కాని నేడు పరిపాలకుల నిర్లక్ష్యం, సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల ఎన్నో ఇబ్బందులకు గురౌతున్నాం. మన చేనేత ప్రపంచ ప్రసిద్ధి చెందింది. కాని ఆర్థికంగా వారికి సరైన ప్రోత్సాహం ఇవ్వకపోవడం వల్లనే నేటి ఆధునికతకు అవసరమైన విధంగా వారు నేత చేయలేకపోతున్నారు. అంతేకాదు, వాటికి రావాల్సినంత ప్రచారం కూడా రాలేదు.

విదేశాలకు వెళ్ళివచ్చినప్పుడల్లా ఆ సిటీలా హైదరాబాద్‌ను మార్చుతాం అని ప్రభుత్వాధినేతలు ప్రకటనలు గుప్పిస్తున్నారు. కాని అక్కడ ప్రభుత్వాలు చేస్తున్నదంతా ఇక్కడ ప్రభుత్వాలు చేయగలవా? ఎందుకంటే అక్కడ ఎక్కడా రోడ్ల మీద చెత్త వేయరు. టాయిలెట్ చేయరు. అక్కడి రోడ్లన్ని ఎంతో శుభ్రంగా ఉంటాయి. కాని మనదగ్గర ఆ పరిస్థితి ఉందా? ఎక్కడ చూసినా చెత్తనే... పక్కనే టాయిలెట్లు ఉంటాయి. కాని బయటికి వెళతారు. రోడ్ల మీదనే ఉమ్మేస్తారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించరు. పురాతన కట్టడాల గోడలపై రాయడం, గీయడం... ఇవన్నీ మార్చకుండా సింగపూర్, హాంకాంగ్ అంటే ఎలా? కాబట్టి ముందుగా ప్రజల్లో అవగాహన కల్పించాలి. దానికి ప్రభుత్వం ముందడుగు వేయాలి. ప్రజల్లో మార్పు రావాలంటే ముందు నేతలు మారాలి. వారిని చూసి ప్రజలు మారతారు. అప్పుడే మన నగరాన్ని కూడా సింగపూర్‌లా మార్చవచ్చు. అంతేకాదు, సింగపూర్, హాంకాంగ్‌లలో వారసత్వ కట్టడాలను ఎంతో సంరక్షించుకుంటారు. వాటిని విలువైన సంపదగా భావిస్తారు. కాని మన దగ్గర మాత్రం వాటి ప్రాముఖ్యతను గుర్తించడం లేదు. ఉదాహరణకు సాలార్‌జంగ్ మ్యూజియం చూడటానికి పక్క రాష్ట్రాల నుంచి ఎంతో మంది వస్తుంటారు. ముఖ్యంగా శనివారం, ఆదివారం అయితే అస్సలు ఖాళీ

ఉండదు. కారణం అక్కడ ఉన్న విలువైన సంపదను తిలకించడానికి జనం పోటెత్తడమే. కాని వాటిని మనం కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నామా అంటే లేదు. అక్కడే చెత్త పడేస్తాం. అక్కడే కూర్చుంటాం. ఇలాంటి పరిస్థితి ఉన్నంతవరకు మన సంపదను కాపాడుకోవడం కష్టం.

శిఖం భూములన్నీ కబ్జా హైదరాబాద్ చెరువులకు పెట్టింది పేరు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎన్నో చెరువులను తవ్వించారు. కాని నేడు అవన్నీ కబ్జాకు గురయ్యాయి. ఒకసారి మా ఇల్లు నీళ్ళలో మునిగిపోయింది. కాపాడండి అంటూ నాకు ఫోన్ వచ్చింది. అది రామక్రిష్ణాపురం చెరువులో కట్టిన ఇల్లు. అప్పుడు అదొక్కటే ఇల్లు ఉంది. వానలు పడేసరికి మొదటి అంతస్తు వరకు మునిగిపోయింది. పై అంతస్తులో ఉన్నారు. దీన్ని ఎలా కట్టారు అంటే ఏం మాట్లాడటం లేదు. అలా ఇప్పుడు చెరువు మొత్తం ఇళ్ళతో నిండిపోయింది. అలాగే సరూర్‌నగర్ చెరువు కూడా. దాని పక్కనే రెండు కాలనీలున్నాయి. ఒకటి ఎత్తులో ఉంది. వానలు పడ్డప్పుడు దాని నుంచి నీళ్ళు కింది కాలనీలోకి వస్తాయి. ఇలా ఎందుకు జరుగుతుందని విచారిస్తే అది చెరువును కబ్జా చేసిన స్థలమని తేలింది. హైదరాబాద్‌లో ఒకప్పుడు 24పైగా చెరువులు ఉండేవి. కాని నేడు ఒక్క చెరువు కనబడితే ఒట్టు. అంతేకాదు, బాలానగర్‌లోని ఇండస్ట్రియల్ వాటర్, పటాన్‌చెరువు కాలుష్యం అంతా నక్కలవాగులో కలుస్తుంది. ఇలా కాలుష్యాలన్నీ చెరువులలో కలిస్తే అండర్‌వాటర్ కాలుష్యం కాదా?

అప్పట్లో చెరువులను ఆనుకొనే భూములుండేవి. వాటిని శిఖం భూములనేవారు. ఇవి వానల సమయంలో నీటితో నిండి ఉంటాయి. చలికాలం తర్వాత అంటే నీరంతా ఇంకిపోయిన తర్వాత వాటిని వ్యవసాయ పనులకు ఉపయోగించుకునేవారు ప్రజలు. వీటిల్లో పర్మినెంట్ కట్టడాలు కట్టకూడదు. కేవలం వ్యవసాయానికి మాత్రమే వాడుకోవాలి. వాటిల్లో నిత్యావసరాలకు ఉపయోగపడే కూరగాయలు, పండ్లు లాంటివి పండించేవారు. వానలు పడే సమయానికి మళ్ళీ వాటిని ఖాళీగా వదిలివేసేవారు. మళ్ళీ అవి చెరువులుగా నిండిపోయేవి. ఇలా వీటిని మల్టీపుల్‌గా ఉపయోగించుకునేవారు. కాని నేడు ఇవన్నీ కబ్జాకు గురయ్యాయి. అనేక భవనాలు వెలిశాయి. ఇలా చెరువులు లేకుండా నీరు లేకుండా ఉంటే ఇక మన తక్షణ అవసరాలు ఎలా తీరుతాయి? మనం ముందుకు ఎలా పోతాము?

డ్రైనేజీ వ్యవస్థ ఎంతో కీలకం నగర నిర్మాణ సమయంలో కుతుబ్ షాహీలు, నిజాంలు ఎంతో ముందు చూపుతో హైదరాబాద్‌కి ఎలాంటి సమస్య రాకుండా డ్రైనేజీ వ్యవస్థను నిర్మించారు. భూగర్భంలో రెండే రెండు పైపులైన్లు ఉంటాయి. ఒకటి వాన నీరు చెరువుల్లోకి చేరే పైపులైనైతే, రెండోది డ్రైనేజీకి సంబంధించిన లైను. కాని నేడు పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. కారణం ఎంతోమంది నివసించడం వల్ల అండర్ గ్రౌండ్ పైప్‌లైన్స్ వ్యవస్థ చిన్నాభిన్నం అయింది. ఎవరు దేనికి కలుపుతున్నారో కూడా తెలియకుండా కలిపేస్తున్నారు. ఏ పైపులైన్ దేనిలోకి వెళ్ళి కలుస్తుందో కూడా తెలియని పరిస్థితి. దాంతో వర్షాకాలంలో మంచినీరు కాలుష్యం అవుతోంది. కాబట్టి ఇప్పటికైనా ప్రణాళికతో పైపులైన్ వ్యవస్థను మారిస్తే సమస్యను తగ్గించవచ్చు.

హైదరాబాద్‌లో ఒకప్పుడు వాన పడుతుందంటేనే మట్టి సువాసనల కోసం ఎదురుచూసేవాళ్ళం. వానలో తడవడం కోసమే సైకిల్ పై రోడ్ల మీద తిరిగేవాళ్ళం. కాని నేడు పరిస్థితి వేరు. వానలు పడుతున్నాయంటేనే భయపడాల్సిన పరిస్థితి. ఎక్కడ ఇరుక్కుపోతామో తెలియదు. ఎక్కడ నీళ్ళు ఇంట్లోకి వస్తాయో తెలియదు. వానాకాలం అంతా భయంతో చచ్చిపోవాల్సిన పరిస్థితులు నేడు ఉన్నాయి. కాబట్టి ఎలాంటి కట్టడాలు కట్టాలన్నా ముందు అక్కడి పరిస్థితులకు అనుగుణంగా ప్లాన్‌లు ఉండాలని కోరుతున్నాను. హైదరాబాద్ పరిస్థితులు ఇక్కడి అర్కిటెక్ట్‌లకు మాత్రమే తెలుసు. మనకు ఎంతో విజ్ఞానవంతులున్నారు. వారి సహకారంతోనే నిర్మాణాలు చేపడితే మన అవసరాలకు మన వాతావరణానికి తగ్గట్లుగా నిర్మాణాలు చేపట్టవచ్చు.

అప్పుడు ఎలాంటి సమస్యలు తలెత్తవు. నక్కను చూసి కుక్క వాత పెట్టుకున్నట్లుగా విదేశీయులను చూసి మనం కూడా మన అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా నిర్మాణాలు చేపడితే ఇక హైదరాబాద్ ప్రజలు నివసించడానికి పనికిరాదు.

హుస్సేన్ సాగర్ ప్రక్షాళన మూసీనదికి, చెరువులన్నింటినీ అనుసంధానం చేస్తూ హుస్సేన్‌సాగర్‌ను నిర్మించారు. కాని ఇవాళ ఇది డ్రైనేజీ వాటర్‌కి కేంద్రంగా మారింది. ముక్కులు బద్దలయ్యే మురుగు వాసన. దారుణంగా విస్తరించిన తూటికాడ, గుర్రపుడెక్క మొక్కలు చెరువు వినాశనానికి దారి తీస్తున్నాయి. అదుపు లేకుండా నగరం మురుగునీరు సరస్సులోకి చేరుతుండటం వల్ల ఈ సమస్య నానాటికి తీవ్రతరమౌతున్నది.

హైదరాబాద్ చెరువులకు పెట్టింది పేరు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎన్నో చెరువులను తవ్వించారు. కాని నేడు అవన్నీ కబ్జాకు గురయ్యాయి.

ఐడిపిఎల్ ఫ్యాక్టరీని రష్యా వారి సహకారంతో నిర్మించారు. కాని దానికి కావాల్సిన పూర్తి సదుపాయాలు ప్రభుత్వాలు కల్పించకపోవడం వల్ల ఆ టెక్నాలజీని ఇక్కడివాళ్ళే తీసుకొని కొత్తగా ప్రైవేట్ ఫ్యాక్టరీలను కట్టుకున్నారు. ప్రభుత్వ ఫ్యాక్టరీ మాత్రం మూతపడింది. ఆ తర్వాత నిర్మించిన వారు కాలుష్య పదార్థాలను ఎక్కడికి వదలాలో తెలియక తికమక పడుతుంటే అప్పటి ప్రభుత్వంవారు పక్కనే ఉన్న నల్లాల్లోకి వదలమన్నారు. ఇప్పుడు ఆ నీరు హుస్సేన్ సాగర్‌లో కలుస్తోంది. ఇలా కాలుష్య కాసారంగా మారిన సాగర్‌లోకి ప్రధానంగా జీడిమెట్ల, బాలానగర్, సనత్‌నగర్ పారిశ్రామిక ప్రాంతాల నుంచి శుద్ధి చేయని వ్యర్థ రసాయనాలు కూకట్‌పల్లి నాలాలో కలిసి సాగర్‌కు చేరుతున్నాయి. ఇలా ఎక్కడెక్కడో చెరువులతో సాగర్‌కు అనుసంధానం ఉండటం వల్ల కాలుష్య పదార్థాలన్నీ కూడా ఇక్కడికి వచ్చి చేరుతున్నాయి. చెరువును కాపాడుకునేది ఎలా అని ఇప్పుడు ఆలోచిస్తున్నాం. ప్రభుత్వాలు కూడా అప్పటి హైదరాబాద్ గురించి తెలిసిన వారిని అడిగి తెలుసుకొని ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదుకదా? కనీసం ఇప్పుడు చేస్తామన్న ప్రక్షాళన అయినా శుద్ధి చేసిన తర్వాత ఆయా ప్రాంతాల నుండి వచ్చే కాలుష్య, వ్యర్థాలను రాకుండా ప్రణాళికతో చేయిస్తే మంచిది. భావితరాలను దృష్టిలో పెట్టుకొని చర్యలు చేపట్టాలి.

దక్కనీ కల్చర్ హైదరాబాద్ జియోగ్రఫీ కల్చర్ ఎలా ఉందంటే... ఇక్కడికి ఎంతో మంది వస్తుంటరు పోతుంటరు...ఇక్కడి సంస్కృతిని మనం హిందు అనలేం, ఇస్లాం అనలేం, క్రిస్టియన్ అనలేం.. ఇక్కడికి వచ్చిన వాళ్ళు మనకు ఒకటి ఇచ్చారు.. ఒకటి తీసుకెళ్ళారు. ఇక్కడికి వచ్చే వాళ్ళందరి యాసలు, భాషాపదాలు, ఆచార సాంప్రదాయాలు కలిసి ఒక కొత్త సంస్కృతిగా అవతరించింది. దీన్నే దక్కన్ సంస్కృతి అంటున్నాం. ఇది హైదరాబాద్ ప్రత్యేకత. దీనిని కాపాడుకోవటం అవసరం.

– ఆశాభారతి

ఆత్మవిశ్వాసంలో ముందడుగు వేసే మహిళలకు అపజయం అన్న పదమే తెలియదని అంటారు ప్రముఖ రచయిత్రి, వ్యాఖ్యాత, సమాచారశాఖ రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ శారదా అశోకవర్ధన్. రేడియో ప్రపంచంలో ఫీల్డ్ ఆఫీసర్‌గా ప్రవేశించిన ఆమె ఎన్నో వైవిధ్యభరితమైన కార్యక్రమాలకు రూపకల్పన చేస్తూ.. శ్రోతల మదిలో సుస్థిర స్థానం సంపాదించారు.

దక్కన్ ప్రభుత్వంలో సమాచారశాఖలో అసిస్టెంట్ ట్రాన్స్‌లేటర్‌గా ఉద్యోగాన్ని ప్రారంభించి.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో అడిషనల్ డైరెక్టర్‌గా ఆమె పదవీవిరమణ చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో రేడియో కళాకారిణిగా శ్రోతలకు చేరువగా ఉన్నారు. తెలుగు సాహిత్యరంగంలో అనేక ప్రక్రియల ద్వారా పాఠకులకు సుపరిచయమైన ఆమె తన అనుభవ నేపథ్యం, రేడియోలో మహిళల కార్యక్రమాల గురించి చెప్పారు.

ఆకాశవాణిలో మహిళల చైతన్యం

దక్కన్ రేడియోలో చైల్డ్ ఆర్టిస్టుగా చేరిన నేను.. మూడు రకాల ప్రభుత్వాలను చూశాను. దక్కన్‌గా ఉన్నపుడు భాషలో యాస ఉన్నా.. లలితకళలకు ప్రోత్సాహం ఉండేది. కళాకారులకు ఆదరణ ఉండేది. ఆ తరువాత అది క్రమక్రమంగా మారి సినిమాల ప్రభావం పెరిగింది. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ కళలకు ఆదరణ పెరుగుతోంది.

ఐదేళ్ల వయస్సులోనే దక్కన్ రేడియో కార్యక్రమాల్లో పాల్గొన్నేదాన్ని. దక్కన్ ప్రభుత్వంలో ఏర్పాటైన చేసిన మొట్టమొదటి బాలికల ఉన్నత పాఠశాల కీస్ హైస్కూల్. నా విద్యాభ్యాసం అక్కడే గడిచింది. మా స్కూల్ ప్రిన్సిపాల్ కళ్యాణ కుట్టి. లలిత కళలను చిన్నతనం నుంచే నేర్చుకునేలా ప్రోత్సహించారు. ఆ రోజుల్లోనే ఉర్దూ, తమిళ, మళయాల, తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో తరగతులు ఉండేవి. పాఠశాల భవననిర్మాణం కోసం ప్రతి సంవత్సరం ఫండ్ రేజింగ్ కార్యక్రమాలను నిర్వహించేవారు. అన్ని భాషల్లో సాంస్కృతిక కార్యక్రమాలు జరిపేవారు. ఆయా రంగాల్లో ప్రముఖులు మాకు శిక్షణ ఇచ్చేవారు. అలా మూడునెలల పాటు రిహార్సల్స్ ఉండేవి. మొదటిసారి నేను వేసిన నాటకం పుండరీకుడు. అందులో నా పాత్ర పుండరీకుడి భార్య జటాబాయి(గయ్యాళి భార్య పాత్ర)తొలి ప్రయత్నంలోనే రాగయుక్తంగా పద్యాలు పాడుతూ.. గయ్యాళి పాత్రను బాగానే పండించాను.

హెూమ్ సైన్సు కాలేజీలో చేరే సమయంలో హాబీస్ కాలమ్ లో నాటకాలు అని రాశాను. కృపదానం తెలుగు లెక్చరర్. మా తరగతిలో 40మంది విద్యార్థుల్లో 30మంది ఇతర భాషల వారు. పది మంది తెలుగువారు. వారిలో నలుగురు మాత్రమే స్పష్టమైన తెలుగు మాట్లాడేవారు. వారితో నాటిక ప్రదర్శన ఏర్పాటు చేయాలనుకున్నారు. ఆమె ప్రోత్సాహంతో టీ కప్పులో తుఫాన్ నాటికను తీసుకుని.. దానిని కుదించి నేనే స్క్రిప్టు రాసి, నా స్నేహితులకు నటన నేర్పించి ప్రదర్శించాం. ఇంటర్ కాలేజ్ పోటీల్లో ఆ నాటికలో ముసలాడిపాత్రకు కన్సొలేషన్ బహుమతులు అందుకున్నాను. సైఫాబాద్‌లో ఉండే దక్కన్ రేడియో స్టేషన్‌లో ఆడిషన్స్‌కు వెళ్లాను. దేవులపల్లి కృష్ణశాస్త్రి నాటకాల విభాగం ఇన్‌చార్జి. నేను, తురగా జానకీరాణి సెలెక్ట్ అయ్యాం. ఈలోగా సమాచారశాఖలో కప్పగంతుల లక్ష్మణశాస్త్రి వద్ద తెలుగు అసిస్టెంట్ ట్రాన్స్‌లేటర్‌గా ఉద్యోగంలో చేరాను. ఆ తరువాత డిప్యుటేషన్ పై ఆల్ ఇండియా రేడియోలో ఫీల్డ్ ఆఫీసర్(ఫ్యామిలీ ప్లానింగ్ ప్రొగ్రామ్స్) గా చేరాను.

వినోదం, విజ్ఞానం, సమాచారం రేడియో

ఆ రోజుల్లో రేడియో అంటేనే.. చెవికోసుకునే వాళ్లు.. ఇంట్లో రేడియో ఉండటాన్ని హోదాగా భావించేవాళ్ళు. వినోదం, విజ్ఞానం, సమగ్ర సమాచారం రేడియో ద్వారా తెలిసేది. శ్రోతల స్పందన వందలాది ఉత్తరాల రూపంలో వచ్చేది. శ్రోతలకే కాదు కళాకారులకు సైతం అందుకున్నవారికి అందుకున్నంత ఆనాటి రేడియో..నైపుణ్యం ఉన్న ఎందరో కళాకారులు రేడియో ద్వారా ప్రముఖులుగా కీర్తిప్రతిష్టలు సాధించారు.

రేడియో కార్యక్రమాల సప్తహం చేసేవాళ్లం. కార్యాలయ ప్రాంగణమంతా పందిళ్ళు వేసి, వేదికలు నిర్మించి, మామిడి తోరణాలు కట్టి ఎంతో అట్టహాసంగా నిర్వహించేవాళ్లం. అతిరథమహారథులంతా తమతమ కళలను ఆ వేదికలపై ప్రదర్శించేవారు. బాలమురళీకృష్ణ సంగీత కచేరి, త్రిపురనేని గోపిచంద్ పర్యవేక్షణలో నాటకాలు ఉండేవి. గృహప్రవేశం నాటికలో హీరోయిన్ పాత్రలో నా అభినయం చూసి సినిమాల్లో నటించమని చాలా మంది అడిగారు. నాన్నగారు ఒప్పుకోక పోవడంతో రేడియోతో నా జీవితం ముడిపడిపోయింది.

మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు..

రేడియో కార్యక్రమాల్లో అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత ఉండేది. మహిళల కోసం ప్రత్యేకంగా స్త్రీల కార్యక్రమం ప్రతిరోజూ మధ్యాహ్నం

పాడిపంటల తరువాత ఉండేది. రేడియో అక్కయ్యగా అందరికి సుపరిచితమైన న్యాయపతి కామేశ్వరమ్మ ఈ కార్యక్రమాన్ని నిర్వహించేవారు. ఇందులో పాల్గొనడం కోసం ఉద్యోగాలు చేసే మహిళలు, గ్రామీణ మహిళలు సంఘాలుగా ఏర్పడి వారి సమస్యలు చర్చించేవారు. సలహాలు, సూచనలు ఇచ్చేవారు. మహిళా సంఘాలను ఏర్పాటు చేసింది రేడియో కార్యక్రమాలే అంటే అతిశయోక్తి కాదు. కామేశ్వరమ్మ అనంతరం తురగా జానకీరాణి ఈ కార్యక్రమాలను నిర్వహించేవారు.

వసుధైక కుటుంబం.. రేడియో స్టేషన్..

శాస్త్రీయ సంగీతం విభాగంలో పాకాల సావిత్రి, న్యూస్ రీడర్ మాడపాటి సత్యవతి, అనౌన్సర్ చిన్నక్క(రతన్ ప్రసాద్), వింజమూరు సీత, సునందిని, శారద శ్రీనివాసన్ ఇలా వివిధ విభాగాల్లో మహిళలు శాయశక్తుల కష్టపడి ఎన్నో పసందైన కార్యక్రమాలు నిర్వహించేవారు. స్టేషన్ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, ఫీల్డ్ ఆఫీసర్, అనౌన్సర్, ఆర్టిస్ట్ అన్న భేదం లేకుండా అందరం కలిసి వసుధైక కుటుంబం మాదిరిగా ఉండేవాళ్ళం. బాలమురళీకృష్ణ, బుచ్చిబాబు, మునిమాణిక్యం, సత్యవతి, జానకీరాణి.. ఇలా ఎందరో కళాకారులు రేడియో నుంచే ఎదిగారు. టాలెంట్ ఉన్న ఎందరో కళాకారులకు రేడియో వేదికైంది. ఎదిగేందుకు సహాయపడింది.

ఆనాటి కళాకారులు ఇప్పటికీ ఎక్కడ ఎదురుపడినా.. అదే ఆప్యాయత ఉంటుంది. ఇప్పటికీ రేడియో కార్యక్రమాలకు అదే ఆదరణ ఉంది.

కుటుంబనియంత్రణపై బుర్రకథ..

నా విభాగం.. కుటుంబనియంత్రణ.. ఇందులో చేయడానికి ఏం ఉంటుంది అనేవాళ్ళు.. నేను దాన్ని సవాల్‌గా తీసుకున్నాను. పాటలు, నాటికలు, బుర్రకథలు రాశాను. కళాకారులతో రేడియోలో ప్రసారం చేశాను. ఢిల్లీ నుంచి ప్రశంసలు అందుకున్నాను. చేయడానికి ఏం ఉంటుంది అన్న వారిచేతనే శహబాష్ అనిపించుకున్నాను.

ఎన్టీఆర్ హయాంలో వ్యాఖ్యాతగా..

మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ ప్రభుత్వంలో స్వాతంత్ర్య దినోత్సవ, రిపబ్లిక్ వేడుకల్లోనే కాకుండా ప్రభుత్వ అన్ని కార్యక్రమాలకు వ్యాఖ్యానం చేసే అవకాశం లభించింది. ఎన్టీఆర్ చిన్నకుమార్తె ఉమామహేశ్వరి వివాహంలోనూ వ్యాఖ్యానం చేశాను. అది నా జీవితంలో మరిచిపోలేని రోజు. ముఖ్యమంత్రి కుమార్తె పెళ్ళి. అంతకు ముందెన్నడు పెళ్ళిళ్ళకు వ్యాఖ్యానం చేయలేదు. ఏం చెప్పాలి? పెళ్ళి గురించి నాకు తెలిసిందంతా చెబుతూ.. ఉమామహేశ్వరి వివాహం రంగరంగవైభోగం అంటూ మధ్యమధ్యలో లింక్ ఇచ్చాను. పెళ్ళి తంతు అయ్యావరకు టెన్షన్.. ఉద్యోగం ఉంటుందో? ఊడుతుందో తెలియదు. చివరికి ఎన్టీఆర్‌గారి అభినందనలతో నా టెన్షన్‌కు తెరపడింది.. ఆ తరువాత సినారె ప్రోత్సాహంతో ఎన్టీఆర్ పై బుర్రకథ రాశాను. ఈ విధంగా రేడియో నా సృజనాత్మక జీవితాన్ని ఇనుమడింపజేసింది.

- యశోద

శ్రామిక మహిళా ఉద్యమ ధృవతారలు

విమలా రణదివే :

శ్రామిక మహిళా ఉద్యమ నిర్మాత. 1979లో ఏర్పడిన మొదటి శ్రామిక మహిళా సమన్వయ కమిటీకి కన్వీనర్‌గాను, సిఐటియు కార్యదర్శిగాను వున్నారు. చనిపోయే వరకు ఆ బాధ్యతల్లో ఉన్నారు. టీ, కాఫీ, రబ్బరు తోటల్లో పనిచేసే ప్లాంటేషన్ కార్మిక సంఘానికి నాయకులుగా కూడా ఉన్నారు. అంగన్‌వాడీ యూనియన్ నిర్మాత.

అహల్య రంగ్నేకర్ :

చిన్నతనంలోనే అన్న బిటి రణదివే ప్రోత్సహంతో జాతీయోద్యమంలోనూ, ఆ తరువాత బొంబాయి బట్టల కార్మికోద్యమంలోనూ పాల్గొన్నారు. అరెస్టులయ్యి జైళ్లకు వెళ్లారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నిర్మాతల్లో ఒకరు. సిఐటియు ఉపాధ్యక్షులుగా కూడా ఉన్నారు.

మానికొండ సూర్యవతి :

రాష్ట్ర మహిళా ఉద్యమ నిర్మాతల్లో ఒకరు. మహిళా లోకం గర్వించదగ్గ మణిపూస మానికొండ సూర్యవతి. ఆశయ సాధన కోసం మొక్కవోని విశ్వాసంతో నిలిచిన ఆదర్శనారి. అట్టడుగు వర్గాలకు కొండంత అండగా నిలబడ్డ త్యాగశీలి.

విజయనిర్మల

250కి పైగా చిత్రాలలో నటించి, 42 చిత్రాలకు దర్శకత్వం వహించి, అత్యధిక చిత్రాల దర్శకురాలిగా రికార్డు సృష్టించారు.

శారదకి మూడు సార్లు ఉత్తమ నటి పురస్కారం

తెలుగు చలనచిత్ర రంగంలో శారద విశిష్ట నటి. బి.ఎస్.నారాయణ దర్శకత్వంలో రూపొందిన నిమజ్జనం చిత్రానికి గాను ఆమెకు జాతీయ స్థాయిలో ఉత్తమ నటి పురస్కారం లభించింది. మొత్తం మూడుసార్లు ఉత్తమ నటి పురస్కారం అందుకున్న శారద నటన విలక్షణమైనది. సహజమైంది. పాత్రలకు జీవం పోయగల ప్రతిభాసంపత్తి పుష్కలంగా ఉన్న నటి ఆమె.

■ సీరియల్

ప్రేమ - విప్లవం



మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

"ఇంగ్లండుకు వచ్చిన తొలిరోజుల్లో తను ఎదుర్కొన్న కష్టాలు, అవమానాలు, ప్రతి చిన్న అవసరానికీ ఇతర్ల మీద ఆధారపడవల్సి రావడం వల్ల మార్క్స్‌లో మనుషుల పట్ల కోపం, జుగుప్స పెరిగి వుంటాయి"అంటాడు తాత్వికుడు ఇసయ్యాబెర్లిన్. ఉన్నత స్థానంలో వుండవలసినవాడు, నాయకుడు కావల్సినవాడు, తన ప్రతిభ, పాండిత్యమూ వృధా అయిపోతుందనే నిస్సహాయత అతడిలో ద్వేషాన్ని రగిలించి ఉంటుంది. "జనమంతా తన మీద కుట్ర చేస్తున్నారనే భావన పెరిగిందేమో". మార్క్స్‌ను విమర్శించటానికి, నిందించటానికి ఇవీ కారణాలు. కాని అతణ్ని ఇప్పుడే అణగతొక్కక పోతే, ఎంత ఎత్తుకు ఎదుగుతాడోననే భయం ప్రత్యర్థులకు అతడి మీద బురద చల్లక తప్పని పరిస్థితి కల్పించింది.

1948 తిరుగుబాటులో పొల్గొన్న ఒక మాజీ ప్రష్యన్ అధికారి గుస్తావ్ చెహోవ్, కమ్యూనిస్టు లీగ్‌లో చేరాలనే ఉద్దేశంతో, 1850లో మార్క్స్, ఎంగెల్స్‌లను కలిశాడు. "మేధో పరంగా సమున్నతుడు మార్క్స్. మేధస్సూ, హృదయం, ప్రేమ, ద్వేషం కూడా ఆయనలో ఉన్నాయి. నేనంటే తనకు అసహ్యమని అప్పుడప్పుడూ సూచించాడు. అయినా నేను ఆయన కోసం నిప్పుల్లో దూకమంటే దూకేవాణ్ని. నాకు తెలిసిన నాయకత్వ లక్షణాలున్న ఏకైక వ్యక్తి ఆయన. పెద్ద విషయాల గురించి ఆలోచిస్తున్నప్పుడు చిన్న విషయాల గురించి అస్సలు పట్టించుకోడు" అని రాశాడు మార్క్స్ గురించి.



నిజానికి మార్క్స్‌కు భార్యాపిల్లలంటే చాలా ప్రేమ. కాని ఆయన తన ప్రేమను అందరిలా వ్యక్తం చేయడు. జెన్నీ, పిల్లల జీవితాలు అంత దుర్భరంగా గడవటానికి కారణమిదే. తను కలలు గన్న నూతన సమాజ సృష్టికి ఆయన ఎన్ని త్యాగాలకైనా సిద్ధపడ్డాడు.

మార్క్స్ మేధో పటిమనూ, బలహీనతల్నీ సరిగానే అంచనా వేశాడు చెహోవ్. అయితే మార్క్స్ ఎప్పుడూ చాలా పెద్ద విషయాల గురించి మాత్రమే ఆలోచించాడు. అందువల్ల మామూలు మనుషుల రోజువారీ విషయాల మీద ఆయనెప్పుడూ దృష్టి పెట్టలేదు. తాను వాటిని విస్మరించడం వల్ల, తన చుట్టూ వున్నవాళ్లు ఏమనుకుంటారో కూడా ఆలోచించలేదు.

జెన్నీ లండన్‌కు వచ్చిన తెల్లారి ఒక ఇబ్బందికరమైన సంఘటన జరిగింది. ఒక శరణార్థుల సంస్థ, మార్క్స్‌ను తమకున్న అయిదుగురిలో ఒక బోర్డు సభ్యునిగా ఎన్నుకుంది. దీని అర్థం మార్క్స్ ఆ సమావేశానికి హాజరయ్యాడనే. లేదా తన గైర్హాజరీ లోనైనా వాళ్లు తనను ఎన్నుకుని ఉండాలి. అలా జరగదు. హాజరయ్యాడనుకుంటే, తన కుటుంబం పట్ల ఆయనకు శ్రద్ధలేదనే అర్థం వస్తుంది. చాలా ఇక్కట్లుపడి, ఫ్రాన్సు నుండి వచ్చిన భార్యా పిల్లల్ని ఇంటికి తీసుకురావడానికి ఆయన హార్బర్ కెళ్లలేదు. దాని కారణం మంచంపై నుండి లేవలేని అనారోగ్యమన్నాడు. కాని మర్నాడు కమిటీ మీటింగుకు హాజరై, బోర్డుకు ఎన్నుకోబడ్డాడు. ఇది నిజమేననుకున్నా, తన రాజకీయ కార్యకలాపాల కోసం కుటుంబాన్ని ఇంతగా అశ్రద్ధ చేసిన సంఘటన ఇదొక్కటే.

నిజానికి మార్క్స్‌కు భార్యాపిల్లలంటే చాలా ప్రేమ. కాని ఆయన తన ప్రేమను అందరిలా వ్యక్తం చేయడు. జెన్నీ, పిల్లల జీవితాలు అంత దుర్భరంగా గడవటానికి కారణమిదే. తను కలలు గన్న నూతన సమాజ సృష్టికి ఆయన ఎన్ని త్యాగాలకైనా సిద్ధపడ్డాడు. తను సమూలంగా మార్చాలనుకున్న వ్యవస్థ పట్ల ఆయన క్రూరంగా, నిర్ధయగా ఉంటే ఫరవాలేదు. కాని ఆ క్రూరత్వం వ్యక్తిగత జీవితాన్ని కూడా ప్రభావితం చేసింది. దశాబ్దం క్రితం, మార్క్స్ తండ్రి కొడుకు అహంకారాన్ని గురించి చాలా బాధపడ్డాడు. కాని, 'కళ కోసమే బతుకుతాను. కళే నా జీవితం' అనుకునే కళాకారుడిలాగా ఆ కుటుంబమంతా తన కోసమే బతకాలనుకున్నాడు(వాళ్లు కూడా మార్క్స్ పని ప్రాముఖ్యతను గుర్తించారు). తను చేస్తున్న పని సరైనదనే నమ్మకం, అతణ్ని కుటుంబ అవసరాలను గుర్తించకుండా చేసింది.

మరి జెన్నీ పరిస్థితి ఏమిటి? భర్త లక్ష్యాల పట్ల, ఆశయాల పట్ల ఆమె నిబద్ధత ఎప్పుడైనా తగ్గిందా! ఇంటి బాధలు అనేక సార్లు తనూ, పిల్లలూ మాత్రమే అనుభవించారు. ఆమె అనేక మందికి రాసిన లేఖల్నీ అసంపూర్తి ఆత్మకథనూ మిత్రుల వాంగ్మూలాలనూ పరిశీలిస్తే కనీసం లండన్‌కు వచ్చిన తొలి రోజుల్లో ఆమె నిబద్ధత కించిత్తైనా తగ్గలేదు. సంపన్న కుటుంబం నుండి వచ్చిన పందొమ్మిదవ శతాబ్ది భార్యగా భర్తను సమర్థించడం తప్ప ఆమెకు మరోదారి లేదన్నది స్పష్టమే. భర్త ప్రవర్తన గురించి ఏ చిన్న ఆరోపణ చేసినా, శత్రువుల చేతికి అస్త్రాలిచ్చినట్టే అవుతుంది. అయితే, కేవలం ఈ కారణంతో కాక, మార్క్స్‌ను ఆమె మనస్ఫూర్తిగా సమర్థించి, అతని రాజకీయ కార్యకలాపాలలో పాలుపంచుకున్నది. తన భర్త ఒక అరుదైన జీనియస్ అని ఆమెకు తెలుసు. అతడికి ఎన్ని బలహీనతలున్నా మార్క్స్‌ను ఆమె గాఢంగా ప్రేమించింది. పూర్తిగా నమ్మింది. రొమాంటిక్ హీరోగా ఊహించుకుని అతడితో ప్రేమలో పడింది. సమాజాన్ని, కుటుంబాన్ని ధిక్కరించి పెళ్లి చేసుకుంది. అతడి జీవిత లక్ష్యం తన లక్ష్యమనుకుంది. తన కష్టాలను ఏకరువు పెట్టిన వైడెమియర్‌కు రాసిన ఉత్తరంలో కూడా. "ఈ కష్టాల వల్ల నేను కుంగిపోతున్నాననుకోకండి. మాది ఒంటరి పోరాటం కాదని నాకు తెలుసు. నా భర్త, నా జీవితభాగస్వామి ఎప్పుడూ నా వెన్నంటే ఉన్నందుకు తృప్తిగా, ఆనందంగా ఉంది". ఆమె కోపమంతా మార్క్స్‌కు ద్రోహం చేసినవాళ్ల మీద. అయితే అధికార వర్గాల గురించి ఆయన వ్యాఖ్యలు చేసినప్పుడు మాత్రం మౌనం వహించింది. ఆమెది కఠిన జీవితం. చాలా జీవితాలకన్నా ఎన్నో రెట్లు ఎక్కువ కఠినమైనది. అయితే ఇందుకు ఆమె మార్క్స్‌ను నిందించలేదు. అతడి ప్రేమాభిమానాలను, తన పట్ల నిజాయితీని మాత్రమే ఆమె ఆశించింది.

లండన్ వచ్చిన తొలి రోజుల్లో ఆమె కాస్త బెదిరినట్టు కనిపించినా, ధైర్యం సడలలేదు. భవిష్యత్తులోకి తొంగి చూడగలిగినా, నిత్యం ఎదురీదిన రాజకీయ, ఆర్థిక సుడిగుండాలలో కూడా ఏమాత్రం తొణకకుండా ప్రతి క్షణం భర్తపక్కనే నిలిచింది. కాని ఆమె ఎదుర్కోబోతున్న అసలు విషాదం రాజకీయమూ, ఆర్థికమూ కాదు వ్యక్తిగతం.

జాల్ట్‌బామెల్, హాలెండ్, ఆగస్టు 1850

కాఫీబ్యాగులు, టీ బాక్సులు, చేపల టిన్నులు ఆయిల్ బాటిళ్ల మీద ఆధారపడిన ఈ ప్రశాంతతను చూస్తుంటే, ఒక దివిటీ తీసుకుని ఈ దేశాన్ని

తగలబెట్టాలనిపిస్తోంది - జెన్నీమార్క్స్

1850 జూన్‌లో వేసవి వుక్క భరించలేకుండా ఉన్నప్పుడు ఒక చల్లని విడిదిని వెదుక్కున్నాడు మార్క్స్. అతి ముఖ్యమైన ఒక పరిశోధన చేస్తున్నానని బ్రిటిష్ మ్యూజియం రీడింగ్ రూం సిబ్బందిని ఒప్పించి పాఠకుడిగా లోపలికి ప్రవేశించేందుకు అనుమతి(రీడర్స్ టికెట్) తీసుకున్నాడు. ఆనాటి నుండి జీవితాంతం అదే అతనికి శరణాలయం. పరిశోధనా కేంద్రం.

ఇప్పుడు ఈ రీడింగ్ రూం ఒక వృత్తాకార హర్మ్యం. కాని 1850లో అది పొడవాటి బల్లలతో, గోడకు నిలువెత్తు అల్మారాలలో పెట్టిన పుస్తకాల దొంతరలతో దర్పన మిచ్చిన ఒక సాధారణ భవనం. ఆ రీడింగ్ రూం అధికారి 1823లో ఇంగ్లండుకు వలసవచ్చిన ఒక ఇటాలియన్. పేరు ఆంటొనీ పనిజీ. 1850నాటికి కష్టపడి పైకొచ్చి ఆ గ్రంథాలయానికి "కీపర్ ఆఫ్ ప్రింటెడ్ బుక్స్" హోదాలో కొనసాగుతున్నాడు.

రాజకీయ చర్చోప చర్చల నుండి, లండన్ వీధుల ధూళి నుండి, ఇంటి సమస్యల నుండి దూరంగా ఇక్కడ కూర్చోవడం మార్క్స్‌కు ఎంతో కొంత మంచి చేసిందనటంలో సందేహం లేదు. మ్యూజియం వాతావరణం అతనిలో కొత్త ఉత్సాహం నింపింది. జీవితంలో అతనికి అత్యంత ఇష్టమైన పని అధ్యయనం.

నిజానికి అప్పుడు కూడా కాస్త అసంతోషంగా ఉన్నాడంటే కారణం... కాలమంతా అక్కడ గడపలేకపోవడమే. గడపలేకపోవడానికి కారణం కూడా స్పష్టమే. అప్పులు. జులై చివరన తిరిగిస్తానని ఒక లండన్ వ్యాపారి దగ్గర ఇరవై పౌండ్లకు ప్రామిసరీ నోటు మీద సంతకం పెట్టాడు. గడువు దగ్గరపడింది. కాని డబ్బులేదు. పారిస్‌లో ఉన్న తన మిత్రుడు కార్ల్‌బ్లైండ్‌ను సహాయం చెయ్యమని రాశాడు. అప్పు తీర్చలేక పోతే నా గురించి ఎంత దుష్ప్రచారం జరుగుతుందో నీకు తెలుసు. ఈ విషయం ప్రష్యన్, బ్రిటిష్ అధికారుల దృష్టికిపోతే ఏమవుతుందో ఊహించగలం. ఫలితం ఏమైందో తెలియదు కాని, ఒక వేళ బ్లైండ్ పంపినా తీర్చవలసిన అప్పుల్లో అది ఏపాటి! ప్రచురించటానికి పుస్తకాలు లేవు. డబ్బువచ్చే మరే పనీ చెయ్యడం లేదు. హాలండ్‌లో ఉన్న అంకుల్ తప్ప తనను ఆదుకునే వాళ్లెవరూ కనిపించడం లేదు.

ఈలోగా, అల్లరచిల్లర వేషాలు కట్టిపెట్టి ప్రమాదకరమైన రాజకీయాలకు స్వస్తిపలికి, ముఖ్యంగా మార్క్స్ సాంగత్యం వదిలి ఇంటికి రావాలని ఎంగెల్స్ మీద ఒత్తిడి పెరిగింది. మార్క్స్ దుష్ప్రభావం నుండి బైటపడాలని వాళ్ల కోరిక. తన రాజకీయ పార్టీ విజయం సాధించేదాకా వ్యాపారం చూసుకొమ్మని అతని సోదరి మారీ సూచించింది. ఎంగెల్స్ తండ్రి, కుమారుడికి మరో సలహా ఇచ్చాడు. "ఈస్టిండియా కంపెనీ, కలకత్తా నుండి జౌళి ఎగుమతులు చేస్తోంది". ఇది లాభసాటి వ్యాపారం. న్యూయార్క్ వెళితే బాగానే ఉంటుందనుకున్నాడు ఎంగెల్స్. అక్కడికైతే, మార్క్స్‌ను కూడా వెంట రమ్మనవచ్చు. కానీ ఈ రెండింటిలో ఏదీ జరగలేదు. లండన్‌లో పరిస్థితులు చేయి దాటిపోతున్నాయి. కూలీ దొరకని శరణార్థులతో వీధులు కిటకిటలాడుతున్నాయి. అనేక మంది రచయితలు పత్రికలు ప్రారంభించడానికీ, విదేశాలలో తమ రచనలు అమ్ముకోటానికీ ప్రయత్నిస్తున్నారు. చివరికి తండ్రి కాటన్‌మిల్లులో పనిచెయ్యటమే సరైన నిర్ణయమనుకున్నాడు ఎంగెల్స్. అలా చెయ్యడం వల్ల "మార్క్స్‌కు కూడా ఆర్థికంగా సహాయపడవచ్చు. అంతా అనుకున్నట్టుగా జరిగితే, ఇంత వరకు కనీవినీ ఎరుగని సంచలనాత్మకమైన పొలిటికల్ ఎకానమీ పుస్తకం రాస్తాడు మార్క్స్. అది తప్పక కార్మిక వర్గాన్ని చైతన్యవంతం చేసి విప్లవానికి సహాయం చేస్తుంది" అన్న విశ్వాసం కూడా ఉంది. మార్క్స్ కూడా తను అలాంటి దశలోనే ఉన్నాననుకున్నాడు. కాకపోతే సమయం పడుతుంది. అంటే ఈ లోగా డబ్బుకావాలి. అప్పటి వరకు ఇద్దర్లో ఎక్కువ సక్సెస్ ఫుల్ రచయిత ఎంగెల్స్..కవిగా, జర్నలిస్టుగా మంచి పేరుంది. కాని అతనికి మార్క్స్ పట్ల ఎంత గౌరవమంటే స్వచ్ఛందంగా తన రచనా వ్యాసంగానికి విరామం ఇచ్చి తన మిత్రుడి గ్రంథరచనకు వీలైనంత సహాయం చెయ్యాలని నిర్ణయించుకున్నాడు.

కొడుకు కాటన్ మిల్లుకు వస్తున్న అసలు కారణం ఎంగెల్స్ తండ్రికి తెలియదు. కారణమేదైతేనేం వచ్చాడు, అంతేచాలు అనుకున్నాడు. జౌళి వ్యాపారంలో పోటీ తీవ్రంగా ఉంది. వ్యాపారంలోని వాటాదారులు మీద ఓ కన్నేసి ఉంచడానికి తన మనిషొకడు మాంచెస్టర్‌లో ఉండాలి. అప్పటికి ఎంగెల్స్ వయస్సు 30 ఏళ్లు. ఏడాదికి 200 డాలర్ల జీతం. వ్యాపార నిమిత్తమైన ఖర్చులకూ, వినోదానికీ అదనంగా చెల్లిస్తారు. అప్పటి జీతాలతో పోల్చితే ఇది చాలా ఎక్కువ. అయితే మార్క్స్‌కి తక్షణ సమస్య, తీర్చవలసిన అప్పులు చాలా ఉన్నాయి. ఎంగెల్స్ మొదటి జీతం తీసుకున్న దాకా అవి ఆగవు.

ఎంగెల్స్ ప్రేరణతో కాబోలు, తను కూడా ఏదైనా చెయ్యాలనుకుంది జెన్నీ. హాలండ్‌లోని జాక్ట్ బామెల్‌కు వెళ్లి 'కార్ల్ అంకుల్' తో మాట్లాడితే ఫలితముండొచ్చు. ఎలాగైనా, భర్తను ఈ ఆర్థిక సమస్యలు వేధించకుండా చూడాలి. భవిష్యత్తు గురించి కొద్దిగా ఆందోళన కూడా ఉన్నది. ఇప్పుడామె మళ్లీ గర్భవతి.

హాలండ్ నుండి తన ప్రయాణం గురించి మార్క్స్‌కు ఇలా రాసింది. "కుదుపులతో, భరించలేని సీ సిక్‌నెస్‌తో పదిహేను గంటలు సముద్రం మీద గడిపాను". ఇంటికి వచ్చిన జెన్నీని లయన్ ఫిలిప్ కాసేపటికి గుర్తుపట్టి, అయిష్టంగానే లోపలికి రమ్మన్నాడు(బడలికతో, అనారోగ్యంతో ఫిలిప్‌కు ఆమెను పోల్చుకోవడం కష్టమైంది). ఇంట్లో ఆడవాళ్లెవరూ లేరు. ఆమె ఉన్నప్పుడు వాళ్లు తిరిగిరారని తెలిసింది. ఇక, విషయం త్వరగా తేల్చుకోవాలని, వారసత్వంలో మార్క్స్ వాటా లభించని పక్షంలో అమెరికాకు వెళ్లకతప్పదని చెప్పింది. ఆశ్చర్యంగా "అలాచేస్తే బాగానే ఉంటుంది" అన్నాడతడు. కాని దానికీ డబ్బు కావాలని స్పష్టం చేసిందిక. అప్పుడు ఫిలిప్ నొచ్చుకుని తమ కృషిని వ్యతిరేకిస్తూ "తనూ, తన పిల్లలూ 1848 తిరుగుబాట్ల వల్ల చాలా నష్టపోయారని" చెప్పాడు.

జులై చివరన తిరిగిస్తానని ఒక లండన్ వ్యాపారి దగ్గర ఇరవై పౌండ్లకు ప్రామిసరీ నోటు మీద సంతకం పెట్టాడు. గడువు దగ్గరపడింది. కాని డబ్బులేదు. పారిస్‌లో ఉన్న తన మిత్రుడు కార్ల్‌బ్లైండ్‌ను సహాయం చెయ్యమని రాశాడు. అప్పు తీర్చలేక పోతే నా గురించి ఎంత దుష్ప్రచారం జరుగుతుందో తెలుసు.

"వచ్చిన పని కాలేదు. ఎంత ప్రయత్నించినా, ఎన్ని విధాలుగా చెప్పినా ఆయన వినలేదు. సాయంత్రం గుండె రాయి చేసుకుని, ఏడుస్తూ పడుకున్నాను. డియర్ కార్ల్ ప్రయత్నం వృథా అయింది. తిరుగు ప్రయాణ ఖర్చులు కూడా రాబట్టలేకపోయాను. నిన్నటి నుండీ ఎంత కుమిలిపోయానో నాకు తెలుసు. నా బాధను మాటల్లో చెప్పలేను.

లావా లాగా పొంగి వచ్చిన కోపంతో "కాఫీ బ్యాగులు, టీ బాక్సులు, చేపల టిన్నులు, ఆయిల్ బాటిళ్ల మీద ఆధారపడిన ఈ ప్రశాంతతను సుఖజీవితాన్ని చూస్తుంటే, ఒక దివిటీ తీసుకుని ఈ దేశాన్ని తగలబెట్టాలిపిస్తోంది" అంటూ రాసింది. ఇంతకన్నా అవమానం ఏం కావాలి! కుటుంబం చేత తిరస్కరించబడిన ముష్టిదితాను. అయినా భర్తను నిందించలేదు. "అనుకున్నది సాధించలేక నిస్సహాయంగా తిరిగివస్తున్నాను. మోసపోయాను. అవమానానికి, తృణీకారానికి గురయ్యాను. నిన్ను పిల్లల్నీ చూడాలని నా అణువణువూ పరితపిస్తున్నది. పిల్లల్ని చూడగానే నా కళ్ల కన్నీటి చెలమలు కాకుండా జాగ్రత్త పడాలి. నా తరపున పిల్లల్ని ముద్దులతో ముంచెయ్యి. నువ్వూ, లెంచెన్ వాళ్లను కంటికి రెప్పలా చూసుకుంటారని నాకు తెలుసు. త్వరలో కలుద్దాం. కార్ల్ ఆఫ్ మై హార్ట్.

(సశేషం)

■ ఈ వారం కవిత్వం

ఉమ్మ నీటి సరస్సులో...

శిలాలోలిత

నేనొక చిగురుమొగ్గ
అప్పుడే పూచిన లేలేత చిగురింత
హిమాగ్ని జ్వాలల్లో ఉదయించే దీపశిఖ
చీకటి గర్భ కుహరాల్లోంచే
ఆలోచనల మొలకల్ని జల్లుకుంటూ వచ్చాను
నేనెవరో తెలీకపోయినా
స్కానింగ్ కిరణాలు ఒళ్ళంతా తడిమి
తొలిసారిగా నేనెవరో చెప్పినప్పుడు...
'బతుకు అమ్మా!' అని ఒక్క అమ్మను అనుకోవడమే తప్పు –
అందరూ వాడిన మాటల కత్తుల గుత్తులు
నాపై ఝళిపించినప్పుడు
తొలిసారిగా చెవులున్నందుకు దు:ఖమొచ్చింది
నన్ను నేనే చూసుకోలేకపోతున్నాను
నాపై అప్పుడే ఈ యుద్ధరావాలేమిటి?
నా ఒంటరి పోరాటానికి మొదటి మెట్టు మొదలైందప్పుడే!
నాకోసం అమ్మ చేస్తున్న యుద్ధానికి
అమ్మా! నేనున్నానని చెప్పాలని తపన
గుండెవుందికానీ – గొంతులేదు కదా!
బాధవుంది కానీ – చూపించలేనుకదా!
మనిషినే కానీ – సగం మనిషినే కదా!
ఈ ఉమ్మనీటి సరస్సులో
నేనొక నెత్తుటి కలువనై ఒలికిపోతానో
రవ్వల మెరుపై వెలుగు చూస్తానో
తెలీదింకా...
కానీ.. నాకు మాత్రం మా అమ్మ ఒళ్ళో ఒదిగిపోవాలనుంది.
అమ్మ చేసిన యుద్ధంలో గెలిచాక

గర్భ సరస్సునుంచి జీవన సముద్రంలోకి
వచ్చి పడ్డాను.
స్త్రీ అంటే కేవలం ప్రశ్నే కాదు
జవాబై నిలబడి నిలదీసే హెచ్చరిక –
పక్షి సముద్రంపై ఎగురుతూ
రెట్టవేసి మలినం చేశానని మురిసిపోతుంది
స్త్రీ అంటేనే మహాసముద్రం
లైంగిక వేధింపుల, వివక్షల రెట్టలెన్ని వేసినా
ఆమె మనో నిగ్రహం ముందు
అనంత ప్రవాహంలో కొట్టుకు పోవాల్సిందే

మొక్క మీద నీళ్ళు చిలకరిస్తే
అది కేవలం ఆహారం అందివ్వడమే
వర్షధారలొస్తే మాత్రం
తనువంతా హరితవనమే
స్త్రీల ఆత్మ విశ్వాసపు వర్షధారలే
జగమంతా ఇంద్రధనస్సుల్ని పూయిస్తారు.
సాధించుకున్న స్వాతంత్ర్యంలో
స్త్రీల స్వేచ్ఛా పతాకం తప్పక రెపరెపలాడుతుంది
బతకనీకె
బట్టకట్టనీకె
రంగురంగుల పూల రెక్కలతో
పువ్వులెక్క ఉండనీకె
స్త్రీల సామూహిక గానోత్సవమే
పోరాటాల పురిటి గడ్డలో మొలకెత్తిన జీవన వృక్షమే ఈ బతుకమ్మ.
పోరాటాలు మనకి కొత్త కూడా కాదు.
అంతిమ విజయం ఎప్పటికైనా మనదే! మనదే!

కవయిత్రి సెల్ : 9391338676

అతికించుకున్న వర్ణాలు



యడ్లవల్లి శైలజ

వర్ణాలన్నీ ఇప్పుడు అతికించినట్లుగానే అనిపిస్తున్నాయి
పచ్చని చీర ధరించాల్సిన ధరణిమాత ఎక్కడో అరాకొర
మసిక వేసినటులుగా అగపడుతుంది మన దురాఘాతాన్ని
గుర్తు చేస్తూ
అరాచక వాదుల అఘాయిత్యంతో నీలిరంగు
ఆకాశం వెలవెలపోతూ వెక్కిరిస్తుంది
కామం కమ్మిన కళ్ళు సృష్టించిన అలజడులతో
పుడమి తల్లి పారే రక్తపుటేరులతో ఎరుపురంగులో
తడిసి ముద్దవుతుంది
పేద ధనిక తారతమ్యాలతో ధర్మాన్ని సూచించే
అశోకచక్రం వేదనగా మూగపోయింది
మనిషి మాత్రం ఏది ఏమైనా నాకేటి
సంబంధం నేను బాగున్నానని విజయగర్వంతో
ఉప్పొంగి పోతున్నాడు
మానవ నైతిక విలువలు కోల్పోయి మళ్ళీ
తాను మొదలైన క్రమ పరిణామం దిశవైపు
ఉరకలు వేస్తున్నాడు
ముఖానికి ముసుగు తొడుక్కుని లోపల
మనిషిని వికృత చేష్టలతో
రెచ్చగొడుతున్నాడు
సహజ వర్ణాన్నివీడి
కృత్రిమ రంగులు పులుముకుని...

కవయిత్రి సెల్ : 9394171299

అది ఇది కాదని అన్నిరంగములా...

కుటుంబంలో పాపాయిగా మొదలు పెట్టిన మగువ జీవితం ఎన్నో దశలు దాటి పరిపూర్ణ మహిళగా ఎదుగుతుంది.

తల్లి తండ్రి వేలు పట్టుకుని బుడి బుడి అడుగులు నేర్చుకున్న చిన్నారి ఎదిగాక మరికొందరికి పాఠాలు నేర్పుతుంది. అసంఘటిత రంగం నుండి అంతరిక్షం వరకు అన్నీ తానై నడిపిస్తుంది. పరిసరాలను శుభ్రపరచడమే కాదు, పదిమందికి అన్నం పెట్టే అన్నపూర్ణలా, ఆరోగ్యాన్నందిచే డాక్టర్‌లా, అందరికీ న్యాయం చెప్పే న్యాయమూర్తిలా, రక్షక భటురాలిలా, వేలమందిని గమ్య స్థానాలకు చేర్చే డ్రైవర్‌లా, సైంటిస్ట్‌లా ఒకటేమిటి అన్నిట్లోనూ తానుంది.

భారత రత్నాలు



'కంటేనే అమ్మ అని అంటే ఎలా' అమ్మకు మారు రూపు థెరిస్సా కదా. చీము నెత్తురులోడే కుష్ఠు బిడ్డలకు లాలపోసి పాలిచ్చే అమ్మకంటే మిన్న ఎవరు?

రాజకీయ రణరంగం మగవాడి అడ్డా కాదు. చివరి రక్తపు బొట్టు ఉన్నంత వరకు దేశానికే ఈ దేహం అంకితం అన్న ప్రియదర్శినికి లేరు సాటి మరో నారి.

'కౌసల్యా సుప్రజా రామ' అంటూ వేంకటేశ్వరునితో పాటు సకల భారతీయులను నిద్రలేపే సుస్వరం. ఉత్తర దక్షిణాలను ఏకం చేసిన ద్రవిడ అంబ సుబ్బులచ్చుమ్మ. కర్నాటక సంగీతంలో ఓలలాడించిన తల్లీ నీ కివే మా వందనాలు.

పరాయిపాలనపై తుపాకి ఎక్కుపెట్టిన అరుణారుణ పతాక. దేశ భక్తికి నిలువెత్తు రూపం ఎవరిదంటే అది అరుణా అసఫ్ ఆలీదే .. అరుణా అసఫ్ ఆలీదే.. అరుణా అసఫ్ ఆలీదే.

'నిద్దుర పోరా తమ్ముడా.. నిద్దురలోన గతము నంతా మరచిపోరా తమ్ముడా'. మగత నిద్రాస్వప్నాల్లోనైనా కాస్త సేద దీరే భాగ్యాన్ని ప్రసాదించే లలిత కోమల మాధుర్య మూర్తి లతా దీదీ కి జేజేలు.

ఇలా భారత ప్రభుత్వం తన నారీ రత్నాలను అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న'ను ఇచ్చి సత్కరించుకుంది.